




RNI TELTEL/2024/89620

తెలంగాణ

# నేటి శుభోదయ

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక








ప్రచురణ : తెలంగాణ | సంపుటి 01 | సంచిక 193 | సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు | పేజీలు - 08 | బుధవారం 02 - సెప్టెంబర్ - 2026 | వెల రూ. 5 /-


# కేసీ వేణుగోపాల్‌తో సీఎం రేవంత్ భేటీ..

- ఢిల్లీలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో సీఎం రేవంత్ భేటీ
- రాష్ట్ర రాజకీయ పరిణామాలపై ఇరువురి మధ్య కీలక చర్చలు
- మంత్రివర్గ విస్తరణ, నామినేటెడ్ పోస్టుల భర్తీపై ప్రధానంగా మంతనాలు

## మంత్రివర్గ విస్తరణపై చర్చ..?

నేటి శుభోదయ, న్యూ ఢిల్లీ : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో భేటీ అయ్యారు. రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిణామాలు, ప్రభుత్వ పాలనకు సంబంధించిన కీలక అంశాలపై ఇరువురు నేతలు చర్చించినట్లు తెలుస్తోంది. ఈ సమావేశం ప్రస్తుతం రాష్ట్ర కాంగ్రెస్ వర్గాల్లో తీవ్ర ఆసక్తిని సంతరించుకుంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం, ఈ భేటీలో ప్రధానంగా మంత్రివర్గ విస్తరణ అంశం చర్చకు వచ్చినట్లు సమాచారం. కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న కేబినెట్ విస్తరణతో పాటు, నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సీఎం రేవంత్ భావిస్తున్నారు. ఈ మేరకు పార్టీ అధిష్ఠానం ఆమోదం కోసం ఆయన వేణుగోపాల్‌తో సంప్రదింపులు జరిపినట్లు తెలుస్తోంది......

2



## 7.8 శాతం వృద్ధి పేరుతో మోదీ 'పంచ్'..

- రాహుల్ ప్రచారంపై 'జూఠ్ కీ గూంజ్' సెటైర్!



- తొలి త్రైమాసికంలో 7.8 శాతం పెరిగిన జీడీపీ
- ఆర్‌బీఐ అంచనాలను అధిగమించిన వృద్ధి
- 'జూఠ్ కీ గూంజ్'పై మోదీ సెటైర్
- రాహుల్ 'ఛాత్రోంకీ గూంజ్' ప్రచారంపై చర్చ

ప్రపంచ సంక్షోభాల మధ్య భారత్ ముందుకెళుతోందని మోదీ వ్యాఖ్య

నేటి శుభోదయ, న్యూ ఢిల్లీ : దేశ ఆర్థిక వ్యవస్థ అంచనాలకు మించి వృద్ధి సాధించిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. 2026–27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో జీడీపీ 7.8 శాతం పెరిగిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా దేశంలో వినిపిస్తున్న 'జూఠ్ కీ గూంజ్' (అబద్ధాల ప్రతిధ్వని) అంటూ సెటైర్ వేశారు. ఈ వ్యాఖ్యలు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన 'ఛాత్రోంకీ గూంజ్' ప్రచారాన్ని ఉద్దేశించినవేనన్న చర్చ మొదలైంది. ఎస్‌సీవో సదస్సు కోసం కిర్గిజిస్థాన్‌లోని బిష్కెక్‌లో ఉన్న మోదీ.. యువతను ఆకట్టుకునేలా ఇన్‌స్టాగ్రామ్‌లో సెల్ఫీ తరహా వీడియోను విడుదల చేశారు. '7.8 శాతం వృద్ధి.. బలమైన గణాంకాలు.. మరింత బలమైన విశ్వాసం' అంటూ దానికి క్యాప్షన్ ఇచ్చారు. ప్రభుత్వ గణాంకాల ప్రకారం.. ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో భారత ఆర్థిక వ్యవస్థ 7.8 శాతం వృద్ధి చెందింది. ఆర్‌బీఐ అంచనాలను కూడా ఈ వృద్ధి అధిగమించింది. ఇరాన్ యుద్ధం, దాని ప్రభావంతో ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న అనిశ్చితి దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపొచ్చన్న అంచనాల మధ్య ఈ వృద్ధి నమోదైంది. ప్రపంచం యుద్ధాలు, సంక్షోభాలతో సతమతమవుతోందని మోదీ అన్నారు. సరఫరా వ్యవస్థలు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. 2020లో కరోనా కాలం నుంచి ఇప్పటివరకు ప్రపంచంలో స్థిరత్వం కనిపించలేదన్నారు. అయినా భారత్ వేగంగా ముందుకు సాగుతోందని చెప్పారు...

2

## కేసీఆర్ పేరు వింటేనే రేవంత్ రెడ్డి వణికిపోతున్నారు - జగదీశ్ రెడ్డి

- రాష్ట్రంలో నీటి ఎద్దడి ఉన్నా ప్రభుత్వ పెద్దలు పట్టించుకోవడం లేదన్న జగదీశ్ రెడ్డి
- అవినీతి సొమ్మును లెక్కించుకోవడంలో నిమగ్నమయ్యారని విమర్శ
- ప్రభుత్వ వైఫల్యాలపై పోరుబాట ప్రారంభి స్తున్నామని వెల్లడి



నేటి శుభోదయ, హైదరాబాద్ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పేరు వింటేనే ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి అనుక్షణం భయం తో వణికిపోతున్నారని, ఆ భయం కారణంగానే ప్రతి రోజూ అనుచిత మాటలు మాట్లాడుతున్నారని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి ధ్వజమెత్తారు. సూర్యాపేటలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో తీవ్రమైన నీటి ఎద్దడి తలెత్తుతున్నా, ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వ పెద్దలు...

2

## ఎంపీ లాడ్స్ నిధుల వినియోగంపై అభాండాలు వేయడం సరికాదు

- బండి సంజయ్

- తన నియోజకవర్గానికి కేటాయించిన నిధుల్లో 94.1 శాతానికి సంబంధించిన పనులు పురోగతిలో ఉన్నాయన్న సంజయ్
- ఏకపక్ష నివేదికలు ఇవ్వడం సరికాదని వ్యాఖ్య
- క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలు ఇవ్వాలని హితవు



2

## హైడ్రా vs గణేశ్ ఉత్సవ సమితి

### - హైదరాబాద్‌లో నిమజ్జనం వివాదం

- హైదరాబాద్‌లో గణేశ్ నిమజ్జనంపై కొత్త వివాదం
- తాము అభివృద్ధి చేసిన చెరువుల్లో నిమజ్జనం కుదరదన్న హైడ్రా
- అడ్డుకునే అధికారం హైడ్రాకు లేదన్న గణేశ్ ఉత్సవ సమితి
- యథావిధిగా అన్ని చెరువుల్లోనూ నిమజ్జనం చేస్తామని స్పష్టీకరణ

2



## 1000 రోజుల దగాపై నేడు చార్జ్‌షీట్

- నేడు తెలంగాణ భవన్‌లో విడుదల చేయనున్న కేటీఆర్
- కాంగ్రెస్ 420 హామీల ఎగవేతలే ఎజెండాగా నేటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ నిరసనలు
- రోజుకో అంశంపై సర్కార్‌ను నిలదీసేలా కార్యాచరణ
- కాంగ్రెస్ బాకీ కార్డుపై ప్రజాక్షేత్రంలో ప్రచారం
- ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ కార్యక్రమాలు

2



## కూతురి వ్యాఖ్యల దుమారం

- అధిష్ఠానం పిలుపుతో హుటాహుటిన ఢిల్లీకి పయనమైన కొండా సురేఖ

- రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కొండా సుస్మిత
- సుస్మిత వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణించిన టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ
- ఇప్పటికే మల్లు రవికి వివరణ ఇచ్చిన కొండా సురేఖ

2



## కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు.. తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టులో భారీ ఊరట

- కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై స్టే ఎత్తివేసిన హైకోర్టు
- తెలంగాణ ప్రభుత్వానికి అనుకూలంగా డివిజన్ బెంచ్ తీర్పు
- సింగిల్ జడ్జి ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను రద్దు చేసిన ధర్మాసనం
- ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాల్లో జోక్యంపై కీలక వాదనలు
- పథకాల అమలుకు తొలగిన అడ్డంకులు



నేటి శుభోదయ, హైదరాబాద్ : తెలంగాణలో అమలవుతున్న కల్యాణ లక్ష్మి , షాదీ ముబారక్ పథకాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టులో భారీ ఊరట లభించింది. ఈ పథకాల అమలును నిలిపివేస్తూ గతంలో సింగిల్ జడ్జి ఇచ్చిన మధ్యంతర స్టే ఉత్తర్వులను ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని డివిజన్ బెంచ్ మంగళవారం రద్దు చేసింది. దీంతో ఈ పథకాల కొనసాగింపునకు మార్గం సుగమమైంది. కల్యాణ లక్ష్మి , షాదీ ముబారక్ పథకాలకు సంబంధించి 2014 నుంచి ప్రభుత్వం జారీ చేసిన ఎనిమిది జీవోలను సవాలు చేస్తూ విజయ్ గోపాల్ అనే న్యాయవాది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ప్రభుత్వం కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయకపోవడంతో, విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి పథకాల అమలుపై మధ్యంతర స్టే విధించారు.....

2

# 7.8 శాతం వృద్ధి పేరుతో మోదీ ‘పంచ్’..

## - రాహుల్ ప్రచారంపై ‘జూర్ కీ గూంజ్’ సెటైర్!

**మొదటిపేజీ తరువాయి..** దేశంలో నిరాశలో ఉన్న కొందరు ‘జూర్ కీ గూంజ్’ను వ్యాప్తి చేస్తున్నారని మోదీ వ్యాఖ్యానించారు. వాటన్నింటినీ అధిగమించి భారత్ 7.8 శాతం వృద్ధి సాధించిందని తెలిపారు. ఇదే వేగాన్ని కొనసాగించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. రాహుల్ గాంధీ యువతను చేరువ చేసుకునేందుకు ఇటీవల ‘ఛాత్రోంకీ గూంజ్’ ప్రచారాన్ని చేపట్టారు. దీనిపై రాజకీయ వ్యంగ్య గ్రూప్ ‘జూర్ కీ గూంజ్’ విమర్శలు చేసింది. తాజాగా మోదీ చేసిన వ్యాఖ్యలు అదే ప్రచారాన్ని ఉద్దేశించినవిగా రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. రాహుల్ గాంధీ ప్రచారంలో చేసిన 40 వ్యాఖ్యల్లో 29 అసత్యాలు, 11 తప్పుదోవ పట్టించేవిగా ఉన్నాయని భాజపా గతంలో ఆరోపించింది.

# హైడ్రా vs గణేశ్ ఉత్సవ సమితి

## - హైదరాబాద్‌లో నిమజ్జనం వివాదం

**మొదటిపేజీ తరువాయి..** హైదరాబాద్‌లో వినాయక చవితి పండుగ సమీపిస్తున్న తరుణంలో విగ్రహాల నిమజ్జనంపై మరోసారి వివాదం నెలకొంది. తాము పునరుద్ధరించిన చెరువుల్లో విగ్రహాల నిమజ్జనాన్ని అనుమతించబోమని హైడ్రా స్పష్టం చేయడంతో ఈ వివాదం రాజుకుంది. అయితే, ఈ నిర్ణయాన్ని భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి తీవ్రంగా వ్యతిరేకించింది. హైడ్రా ప్రకటనపై గణేశ్ ఉత్సవ సమితి ఘాటుగా స్పందించింది. విగ్రహాల నిమజ్జనాన్ని అడ్డుకునే అధికారం హైడ్రాకు లేదని సమితి స్పష్టం చేసింది. దశాబ్దాలుగా కొనసాగుతున్న సంప్రదాయాన్ని అడ్డుకోవాలని చూడటం తగదని, ప్రతి ఏటా మాదిరిగానే నగరంలోని అన్ని చెరువుల్లోనూ నిమజ్జనం నిర్వహించి తీరుతామని ఉద్ఘాటించింది. హిందూ పండుగలపై ప్రభుత్వం ఆంక్షలు విధించడం సరికాదని ఉత్సవ సమితి పేర్కొంది. విగ్రహ నిమజ్జనం వల్ల చెరువులు కలుషితమవుతున్నాయనడానికి ఎటువంటి శాస్త్రీయ ఆధారాలు లేవని వాదించింది. ఇరు పక్షాల మధ్య నెలకొన్న ఈ భిన్న వాదనలతో ప్రస్తుతం నిమజ్జనంపై గందరగోళం నెలకొంది.

# కేసీ వేణుగోపాల్‌తో సీఎం రేవంత్ భేటీ..

**మొదటిపేజీ తరువాయి..** ఇదే సమయంలో పార్టీలో క్రమశిక్షణకు సంబంధించిన అంశాలు కూడా ప్రస్తావనకు వచ్చినట్లు సమాచారం. మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డికి క్రమశిక్షణ సంఘం జారీ చేసిన షోకాజ్ నోటీసులు, వారు సమర్పించిన వివరణలపై ఈ భేటీలో చర్చించినట్లు తెలుస్తోంది. వీరిపై తీసుకోవాల్సిన చర్యలకు సంబంధించి అధిష్ఠానం అభిప్రాయాన్ని ముఖ్యమంత్రి కోరినట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

# కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు..

## తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టులో భారీ ఊరట

**మొదటిపేజీ తరువాయి..** సింగిల్ జడ్జి ఉత్తర్వులను సవాలు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించింది. ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ (ఏజీ) సుదర్శన్ రెడ్డి వాదనలు వినిపిస్తూ, ఈ పథకాలు 2014 నుంచి నిరంతరాయంగా అమలవుతున్నాయని, పిటిషనర్ లబ్ధిదారుడు కానందున ఆయనకు ఎలాంటి నష్టం వాటిల్లలేదని కోర్టుకు తెలిపారు. ఇది ప్రజాప్రయోజన వ్యాజ్యం కాదని, ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాలపై దాఖలైన ఇలాంటి వ్యాజ్యాలను డివిజన్ బెంచ్ మాత్రమే విచారించాలని వాదించారు. షాదీ ముబారక్ వంటి పథకాలకు సుప్రీంకోర్టు కూడా గతంలో అనుమతినిచ్చిందని ఈ సందర్భంగా గుర్తుచేశారు. అడ్వకేట్ జనరల్ వాదనలతో ఏకీభవించిన డివిజన్ బెంచ్, సింగిల్ జడ్జి ఇచ్చిన స్టే ఉత్తర్వులను ఎత్తివేస్తూ తీర్పునిచ్చింది. హైకోర్టు తాజా నిర్ణయంతో కల్యాణ లక్ష్మి , షాదీ ముబారక్ పథకాల అమలు రాష్ట్రవ్యాప్తంగా యథావిధిగా కొనసాగనుంది.

# కేసీఆర్ పేరు వింటేనే రేవంత్ రెడ్డి వణికిపోతున్నారు - జగదీశ్ రెడ్డి

**మొదటిపేజీ తరువాయి..** పట్టించుకోవడం లేదని జగదీశ్ రెడ్డి మండిపడ్డారు. ప్రజా సమస్యలను పూర్తిగా పక్కనబెట్టి అవినీతి సొమ్మును లెక్కించుకోవడంలో నిమగ్నమయ్యారని ఆరోపించారు. ప్రతిరోజూ కేసీఆర్‌ను గుర్తుచేసుకోవడంలో రేవంత్ రెడ్డే ప్రథమ స్థానంలో ఉంటారని ఎద్దేవా చేసిన ఆయన... "కేసీఆర్‌ను నేరుగా ఎదుర్కొనే ధైర్యం నీకుందా?" అని రేవంత్‌ను ప్రశ్నించారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి రేవంత్ సచివాలయానికి ఎన్నిసార్లు వచ్చారో సమాధానం చెప్పాలని నిలదీశారు. ఆంధ్రప్రదేశ్‌కు అక్రమంగా నదీ జలాలు తరలిపోతుంటే అడ్డుకోలేకపోవడం ప్రభుత్వ అసమర్థతకు, అవినీతికి నిదర్శనమని మండిపడ్డారు. తనకు రాజకీయంగా జన్మనిచ్చిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు సీఎం ద్రోహం చేయడం వల్ల మళ్లీ అక్కడ వలసలు ప్రారంభమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, వ్యవసాయ సంక్షోభంపై రేపు బీఆర్ఎస్ పోరుబాట ప్రారంభించనుందని ప్రకటించారు. ఇందులో భాగంగా మిర్యాలగూడలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో భారీ రైతు సభను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా మిర్యాలగూడ రైతు సభను నిర్వహించి తీరుతామని, రైతులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని జగదీశ్ రెడ్డి స్పష్టం చేశారు.

# 1000 రోజుల దగాపై నేడు చార్జ్‌షీట్

**మొదటిపేజీ తరువాయి..** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల దగా పాలనపై బీఆర్ఎస్ పోరుబాట పట్టనున్నది. అలవికాని హామీలు ఇచ్చి వెయ్యి రోజులు గడిచినా అమలు చేయకుం డా ప్రజలను మోసం చేసిందంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై చార్జ్‌షీట్ వేయనున్నది. బుధవారం ఉదయం 11గంటలకు తెలంగాణ భవన్‌లో కాంగ్రెస్ పాలనపై బీఆర్ఎస్ వరింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు చార్జ్‌షీట్‌ను విడుదల చేయనున్నారు. చార్జ్‌షీట్‌తోపాటు 420 హామీలు, ఆరు గ్యారెంటీల అమలును ప్రశ్నిస్తూ ఈ నెల 8వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా వరుస నిరసన కార్యక్రమాలు చేపట్టేందుకు బీఆర్ఎస్ సేన సిద్ధమైంది. చార్జ్‌షీట్‌తో మొదలయ్యే ఈ పోరాటాన్ని ప్రజాఉద్యమంగా మార్చాలని బీఆర్ఎస్ వ్యూహం రచించింది. బుధవారం నుంచి ధర్నాలు, రైతు సదస్సులు, వంటావార్పులు, యువత ర్యాలీలు, ఆటో ర్యాలీలు, ప్ర జావాణి వినతి పత్రాలు.. ఇలా ప్రతిరోజూ ఒకో అంశంపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని చుట్టుముట్టేలా బీఆర్ఎస్ కార్యాచరణను సిద్ధం చే సింది. ఈ మేరకు మాజీ మంత్రులు, రాష్ట్ర నేతలు ఎక్కడికక్కడ పార్టీ సన్నాహక సమావేశాల ద్వారా శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

- దేవుండ్ల సాక్షిగా ఒట్లు వేసి గ్యారెంటీ కార్డులు పంపిణీ చేసిన కాంగ్రెస్ నేతలు.. వాటి అమల్లో ఘోరంగా విఫలమయ్యారని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి మండిపడ్డారు. వం ద రోజుల్లోనే హామీలన్నీ అమలు చేస్తామని చెప్పారని, కానీ వెయ్యి రోజులవుతున్నా పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. ‘వెయ్యి రోజులు.. వెయ్యి అబద్ధా లు’ కార్యక్రమంలో భాగంగా నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ మండలంలోని లింబాద్రి గుట్టపై కాంగ్రెస్ బాకీ కార్డులకు మంగళవారం వేముల పూజలు చేసి విడుదల చేశారు. రైతులు, మహిళలు, విద్యార్థుల సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు నియోజకవర్గంలో నిరసనలు ఉధృతం చేస్తామని తెలిపారు.

- బీఆర్ఎస్ పోరుబాటలో భాగంగా కాంగ్రె స్ 1000 రోజుల పాలనా వైఫల్యాలను వి వరిస్తూ గ్రామాల్లో ఫ్లెక్సీలు వెలుస్తున్నా యి. నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మం డలం ఉప్లూర్‌లో ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు.

- కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనలో సంక్షేమం మాయమై.. విధ్వంస పాలన సాగుతున్నదని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి దుయ్యబట్టారు. మంగళవారం వనపర్తి బీఆర్ఎస్ భవనంలో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. రేవంత్ ప్రభుత్వ వైఫల్యాలపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సమరభేరి మోగించనున్నట్టు తెలిపారు. 6 గ్యారెంటీలు, 420 హామీ లు, 11 డిక్లరేషన్లు అమలు చేసే దాకా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.

- రేవంత్ సర్కార్ ఒక్క హామీ కూడా అమ లు చేయకుండా ప్రజలను మోసం చేసిందని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు. మంగళవారం మహబూబ్‌నగర్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో ముఖ్య నేతలతో ఆయన సమావేశమయ్యారు. రేవంత్ పాలనలో వెయ్యి రోజుల వైఫల్యాలను ఎండగట్టేందుకు బుధవారం నుంచి వారం నిరసనలుంటాయని తెలిపారు.

- హామీలు నెరవేర్చేదాకా ప్రజల పక్షాన పోరాటం చేస్తామని మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాసర్ పేర్కొన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, నన్నపునేని నరేందర్‌తో కలిసి సమావేశంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ ఎగ్గొట్టిన హామీలపై నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు.

# ఎంపీ లాడ్స్ నిధుల వినియోగంపై అభాండాలు వేయడం సరికాదు : బండి సంజయ్

**మొదటిపేజీ తరువాయి..** ఎంపీ లాడ్స్ నిధుల వినియోగంలో పార్లమెంట్ సభ్యులు తీవ్రంగా వెనుకబడ్డారంటూ 'ఎంపవర్ ఇండియన్' సంస్థ విడుదల చేసిన నివేదిక సత్యదూరమని, వాస్తవాలను పరిగణనలోకి తీసుకోకుండా ఎంపీలపై అభాండాలు వేయడం సరికాదని కేంద్ర మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. ఈ మేరకు తన కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన ఎంపీ ల్యాడ్స్ నిధుల ఖర్చు వివరాలను ఆయన గణాంకాలతో సహా మీడియాకు వివరించారు. కేంద్ర ప్రభుత్వం తన నియోజకవర్గానికి రూ. 17.50 కోట్లు కేటాయించగా, అందులో ఏకంగా 94.1 శాతం నిధులకు (రూ. 16.47 కోట్లు) సంబంధించిన పనులు వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయని స్పష్టం చేశారు. కమ్యూనిటీ హాళ్లు, బోర్‌వెల్స్, సీసీ రోడ్ల వంటి ప్రజావసరాల కోసం గత మూడేళ్లలో 627 ప్రతిపాదనలను కలెక్టర్లకు పంపగా, వాటిలో 82.29 శాతం పనులకు ఇప్పటికే ఆమోదం లభించిందన్నారు. అంతే కాకుండా, గతంలో 16వ లోక్‌సభ సభ్యుడిగా ఉన్న బి. వినోద్ కుమార్ ఖర్చు చేయకుండా వదిలేసిన రూ. 2.5 కోట్ల నిధులను కూడా తానే ఉపయోగించినట్లు గుర్తుచేశారు. స్థానిక సమస్యల పరిష్కారానికి కేంద్రం ఇచ్చే నిధులు చాలడం లేదని, ప్రతి ఏటా ఎంపీ లాడ్స్ కోటాను పెంచాలని ఎంపీలంతా విజ్ఞప్తి చేస్తున్న తరుణంలో ఇలాంటి ఏకపక్ష నివేదికలు ఇవ్వడం అన్యాయమని సంజయ్ ఆవేదన వ్యక్తం చేశారు. నిధుల కేటాయింపు నుంచి కలెక్టర్ల ఆమోదం, పనుల అమలు వరకు అనేక దశలు ఉంటాయని... ఆర్థిక సంవత్సరం ముగియడానికి ఇంకా సమయం ఉన్నప్పటికీ నిధులన్నీ ప్రాసెస్ అయ్యాయని తెలిపారు. ప్రజల విజ్ఞప్తుల కోసం సీఎస్ఆర్ నిధులను కూడా సేకరిస్తున్నామని పేర్కొన్న ఆయన, ఇకనైనా వాస్తవాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలు ఇవ్వాలని సదరు సంస్థకు హితవు పలికారు.

# కూతురి వ్యాఖ్యల దుమారం

## - అధిష్ఠానం పిలుపుతో హుటాహుటిన ఢిల్లీకి పయనమైన కొండా సురేఖ

**మొదటిపేజీ తరువాయి..** తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో మంత్రి కొండా సురేఖ అంశం ఉత్కంఠను రేపుతున్న సంగతి తెలిసిందే. తాజా పరిణామాల నేపథ్యంలో సురేఖ హుటాహుటిన ఢిల్లీకి పయనమయ్యారు. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం నుంచి వచ్చిన అత్యవసర పిలుపు మేరకు ఆమె హస్తిన బాట పట్టారు. ఈ పర్యటనలో భాగంగా ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో సురేఖ ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. అలాగే, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసేందుకు కూడా ఆమె అపాయింట్‌మెంట్ కోరారు. ఇటీవల వరంగల్ జిల్లా గీసుకొండలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిలను ఉద్దేశించి కొండా సురేఖ కుమార్తె సుస్మిత చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు కాంగ్రెస్ వర్గాల్లో పెను సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. సొంత పార్టీ ముఖ్యమంత్రిపైనే విమర్శలు గుప్పించడాన్ని తీవ్రంగా పరిగణించిన టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ... ఆ వ్యాఖ్యలపై తక్షణమే వివరణ ఇవ్వాలంటూ మంత్రి కొండా సురేఖకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఈ క్రమంలో కమిటీ ఛైర్మన్ మల్లు రవికి ఆమె ఇప్పటికే తన వివరణను సమర్పించారు. కొండా సురేఖ ఇచ్చిన వివరణతో పాటు, వనపర్తి వ్యవహారంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిపై రూపొందించిన సమగ్ర నివేదికను టీపీసీసీ నేరుగా అధిష్ఠానానికి పంపించింది. అధిష్ఠానం వద్దకు నివేదికలు చేరిన వెంటనే కొండా సురేఖకు ఢిల్లీ నుంచి పిలుపు రావడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠను రేకెత్తిస్తోంది. క్రమశిక్షణ ఉల్లంఘన అంశంలో కాంగ్రెస్ హైకమాండ్ మంత్రి సురేఖ విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోనుందన్న దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

# నల్గొండ ఘటనపై రగులుతున్న రాజకీయం...

## - టీబీజేపీ చీఫ్ రాంచందర్ రావు హౌస్ అరెస్ట్

**మొదటిపేజీ తరువాయి..** నల్గొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి ఇంటిపై నిన్న జరిగిన దాడితో తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీల మధ్య రాజకీయ ఉద్రిక్తతలు పరాకాష్ఠకు చేరాయి. బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు ఈరోజు నల్గొండ బయల్దేరిన తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావును పోలీసులు తార్నాకలోని ఆయన నివాసం వద్ద అడ్డుకుని హౌస్ అరెస్ట్ చేశారు. పోలీసుల ఆంక్షలను ధిక్కరించి ముందుకు వెళ్లేందుకు యత్నించిన ఆయనను అదుపులోకి తీసుకుని పోలీస్ వాహనంలోకి తరలించారు. ఈ సందర్భంగా రాంచందర్ రావు మాట్లాడుతూ... రేవంత్ రెడ్డి ప్రభుత్వం, పోలీసుల తీరుపై తీవ్రస్థాయిలో



ధ్వజమెత్తారు. రాష్ట్రంలో అసలు ప్రజాస్వామ్యం ఉందా? అని ప్రశ్నిస్తూ... ప్రజా సమస్యలపై పోరాడుతున్న బీజేపీ నాయకులపై కాంగ్రెస్ శ్రేణులు దాడులకు పాల్పడటం అత్యంత హేయమైన చర్య అని మండిపడ్డారు. బాధితులను పరామర్శించడానికి వెళుతుంటే అక్రమ అరెస్టులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 1000 రోజుల పాలనలో ప్రజలను తీవ్రంగా దగా చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం పతనానికి అతి సమీపంలో ఉందని జోస్యం చెప్పారు. ఈ ఘటనతో అటు నల్గొండలోనూ, ఇటు రాజధాని హైదరాబాద్‌లోనూ ఇరు పార్టీల మధ్య ప్రతిఘటనలు తీవ్రరూపం దాల్చాయి. నల్గొండలోని వర్షిత్ రెడ్డి ఇల్లు, కార్యాలయంపై కాంగ్రెస్ శ్రేణుల దాడికి నిరసనగా బీజేపీ కౌంటర్ ఎటాక్‌కు దిగడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మరోవైపు హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయాన్ని ముట్టడించేందుకు వచ్చిన కాంగ్రెస్ కార్యకర్తలను పోలీసులు తీవ్రంగా శ్రమించి అడ్డుకున్నారు. నిరసనలు, అరెస్టులతో రెండు పార్టీల మధ్య ఘర్షణ పూరిత వాతావరణం కొనసాగుతోంది.

# టీవీ కళాకారుల సంక్షేమానికి ఆపద్బంధు పథకం

- **టీవీ కళాకారులకు గద్దర్ అవార్డులు, నంది అవార్డులు అందించేందుకు కృషి**





**హైదరాబాద్, సెప్టెంబర్ 01, నేటి శుభోదయ :** బంజారాహిల్స్ పరిధిలోని ప్రసాద్ ల్యాబ్స్ ప్రాంగణంలో టీవీ ఫెడరేషన్ ప్రమాణ స్వీకార మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ చలనచిత్ర అభివృద్ధి సంస్థ చైర్మన్ దిల్ రాజు, ఆంధ్రప్రదేశ్ చలనచిత్ర అభివృద్ధి సంస్థ చైర్మన్ భరత్ భూషణ్ హాజరయ్యారు.ఈ సందర్భంగా దిల్ రాజు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సినీ కళాకారులకు అందజేస్తున్న గద్దర్ అవార్డులను టీవీ కళాకారులకు కూడా అందించాలనే ఆలోచనతో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని కలసి ఈ విషయంపై చర్చించినట్లు తెలిపారు. టీవీ రంగానికి చెందిన కళాకారులకు తగిన గుర్తింపు, గౌరవం దక్కేలా కృషి చేస్తామని పేర్కొన్నారు.ఆంధ్రప్రదేశ్ చలనచిత్ర అభివృద్ధి సంస్థ చైర్మన్ భరత్ భూషణ్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో టీవీ కళాకారులకు కూడా నంది అవార్డులు అందించే అంశంపై చర్చించినట్లు తెలిపారు. టీవీ రంగంలో సేవలందిస్తున్న కళాకారులు, సాంకేతిక నిపుణుల సంక్షేమానికి ప్రభుత్వ సహకారం అందేలా కృషి చేస్తామని చెప్పారు.ఆపదలో అండగా ఆపద్బంధుఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ సందర్భంగా ఆపద్బంధు పథకాన్ని ప్రకటించారు. ఫెడరేషన్ పరిధిలోని యూనియన్ సభ్యుల్లో ఎవరికైనా అకాల మరణం సంభవించిన విషయం తెలిసిన మూడు గంటల్లోపు వారి కుటుంబానికి లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.అలాగే ప్రతి సభ్యుడికి ఐదు లక్షల రూపాయల ప్రమాద బీమా, ఆసుపత్రి ఖర్చుల కోసం పది లక్షల రూపాయల వరకు ఆర్థిక భరోసా కల్పించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు.కళాకారుల పిల్లలకు స్కాలర్‌షిప్‌లుఫెడరేషన్ పరిధిలోని యూనియన్ సభ్యుల పిల్లలకు విద్యాభ్యాసంలో ప్రోత్సాహం అందించేందుకు స్కాలర్‌షిప్‌లు అందించే ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. సినిమా, టీవీ ఫెడరేషన్ యూనియన్ సభ్యుల పిల్లల కోసం ప్రత్యేక పాఠశాలను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో చలనచిత్ర అభివృద్ధి సంస్థ డైరెక్టర్ చదలవాడ శ్రీనివాసరావు, తెలుగు సినిమా ఫెడరేషన్ అధ్యక్షుడు వల్లభనేని అనిల్, తెలంగాణ మూవీ టీవీ డిజిటల్ ఆర్టిస్ట్ యూనియన్ అధ్యక్షుడు రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

# కుక్కలు బాబోయ్ కుక్కలు.. సిరికొండలో స్వైర విహారం!



**నిజామాబాద్ రూరల్ సిరికొండ, సెప్టెంబర్ 01, నేటి శుభోదయ :** మండల కేంద్రమైన సిరికొండ గ్రామంలో వీధి కుక్కల సంచారం రోజురోజుకూ పెరిగిపోవడంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. గ్రామ వీధుల్లో గుంపులు గుంపులుగా కుక్కలు స్వైర విహారం చేస్తుండటంతో కాలనీవాసులు, బాటసారులు బయటకు రావాలంటేనే జంకుతున్నారు.ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధులు మరియు పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు ఒంటరిగా నడవడానికి తీవ్ర భయభ్రాంతులకు గురవుతున్నారు. ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారి వెనకాల కుక్కలు పడి త్వరితగతిన తరిముతుండటంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందనడంతో పాటు ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.కుక్కలు పదుల సంఖ్యలో గుంపులుగా చేరి వీధుల్లోకి వచ్చే వారిపైకి దూసుకొస్తున్నాయి.రాత్రి సమయాల్లో ఊళ్లలోకి వెళ్లే ప్రయాణికులను మరియు పని ముగించుకుని ఇంటికి వచ్చే కూలీలను తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నాయి. ఇదే విషయమై పలు పత్రికల్లో కథనాలు వచ్చిన ఎవరూ కూడా స్పందించడం లేదు ప్రజల మీద మరి ఇంతా నిర్లక్ష్యమా ఇప్పటికైనా పంచాయతీ అధికారులు, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి వీధి కుక్కల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని సిరికొండ గ్రామ ప్రజలు కోరుతున్నారు.

# ఐఅండ్ పీఆర్ జేడీ జగన్ కు అడిషనల్ డైరెక్టర్ గా పదోన్నతి

- **అభినందనలు తెలియజేసిన టీడబ్ల్యూజేఎఫ్ నేతలు**



**హైదరాబాద్, సెప్టెంబర్ 01, నేటి శుభోదయ :** రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ అడిషనల్ డైరెక్టర్ గా పదోన్నతి పొందిన జాయింట్ డైరెక్టర్ డి ఎస్. జగన్ కు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య అభినందనలు తెలియజేశారు. మంగళవారం ఆయన పలువురు ఫెడరేషన్ నాయకులతో కలిసి మాసబ్ ట్యాంక్ లోని సమాచార భవన్ (ఐఅండ్ పీఆర్ కార్యాలయం) లో జగన్ ను కలిసి పూలబోకే అందజేసి అభినందనలు తెలియజేశారు. సోమయ్య తో పాటు ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్, జాతీయ కౌన్సిల్ సభ్యులు కుంచం శ్రీనివాస్, యర్రమిల్లి రామారావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె.పాండురంగారావు, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వి. రవికుమార్, రంగారెడ్డి జిల్లా నాయకులు నంబి పర్వతాలు, గోవింద్ నాయక్, ఎం. రవికుమార్ తదితరులు నూతన అడిషనల్ డైరెక్టర్ జగన్ కు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య మాట్లాడుతూ, సమాచార శాఖలో వివిధ హోదాల్లో పనిచేసిన డిఎస్ జగన్ కు డిప్యూటీ డైరెక్టర్ గా పదోన్నతి లభించడం అభినందనీయమని అన్నారు. రాష్ట్రంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన ఈ సందర్భంగా జగన్ దృష్టికి తీసుకువెళ్ళి త్వరితగతిన పరిష్కరించాలని కోరారు.

# ప్రజా బాత్రూమ్స్‌లో నాణ్యతా లోపం.. ప్రారంభమైన నెల రోజుల్లోనే విరిగిపోయిన డోర్లు!

- **కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంపై ప్రజల తీవ్ర ఆగ్రహం**





**నిజామాబాద్ రూరల్ ధర్పల్లి, సెప్టెంబర్ 01, నేటి శుభోదయ** ధర్పల్లి,మండలం లోని బస్ స్టాప్ లో గల ప్రజల మూత్రశాలల కోసం ప్రజాధనంతో నిర్మించే ప్రభుత్వ నిర్మాణాలపై కాంట్రాక్టర్లు, అధికారుల పర్యవేక్షణ కొరవడటానికి ధర్పల్లి పాత బస్టాండ్ సంఘటనే నిదర్శనంగా నిలుస్తోంది. ధర్పల్లి పాత బస్టాండ్ ప్రాంతంలో ప్రయాణీకుల సౌకర్యం కోసం నూతనంగా నిర్మించి, ప్రారంభించి నెల రోజులు కూడా పూర్తికాక ముందే ప్రజా బాత్రూమ్‌ల తలుపులు విరిగిపోవడం పట్ల స్థానికులు, ప్రయాణీకులు తీవ్ర విస్మయం వ్యక్తం చేస్తున్నారు.ప్రారంభోత్సవం జరిగి కనీసం నెల రోజులు కూడా గడవకముందే బాత్రూమ్ డోర్లు ఇరిగిపోవడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ నిధులతో చేపట్టిన ఈ పనుల్లో కాంట్రాక్టర్లు తీవ్రస్థాయిలో నాణ్యతా ప్రమాణాలను విస్మరించారని, తక్కువ నాణ్యత గల మెటీరియల్ వాడటం వల్లే నిర్మాణం పూర్తికాగానే దెబ్బతిన్నాయని స్థానికులు మండిపడుతున్నారు.నిత్యం వందలాది మంది రాకపోకలు సాగించే పాత బస్టాండ్ ప్రాంతంలో అత్యవసర సేవలకు ఉపయోగపడాల్సిన పబ్లిక్ టాయిలెట్లు ఇలా నెల రోజులకే నిరుపయోగంగా మారడం అధికారుల పర్యవేక్షణ లోపానికి అద్దం పడుతోందని విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు నాణ్యత లేని పనులు చేసిన కాంట్రాక్టర్లపై తక్షణమే తనిఖీలు చేపట్టి చర్యలు తీసుకోవాలని, వెంటనే విరిగిపోయిన డోర్లను మరమ్మతు చేయించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ధర్పల్లి ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# కాంగ్రెస్ వైఫల్యాలు, అబద్ధాలను ఎండగడతాం : బిఆర్ఎస్ నాయకుల ధ్వజం

- **జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లింగాల కమల్ రాజు**






**మధిర, సెప్టెంబర్ 01, నేటి శుభోదయ :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయినా, ఎన్నికల సమయంలో ఇచ్చిన 6 గ్యారెంటీలు మరియు 420 హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లింగాల కమల్ రాజు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. 100 రోజుల్లో హామీలు అమలు చేస్తామని బాండ్ పేపర్లు రాసి, దేవుడి సాక్షిగా ప్రమాణాలు చేసి ప్రజలను నిట్టనిలువునా మోసం చేశారని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర సాధకులు కేసీఆర్ గారి ఆదేశాలు, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, అసెంబ్లీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు గారి సూచనల మేరకు ప్రభుత్వం అనుసరిస్తున్న మోసపూరిత వైఖరిని ఎండగడుతూ రేపటి (2వ తేదీ) నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.ప్రభుత్వ వైఫల్యాలపై తీవ్ర ఆగ్రహం:ప్రభుత్వ పదవీకాలంలో సగానికి పైగా సమయం (33 నెలలు దాటి 34వ నెలలోకి వచ్చినా) పూర్తయినా ఏ ఒక్క హామీ నెరవేర్చలేదని విమర్శించారు. కళ్యాణలక్ష్మి తో పాటు ఇస్తామన్న తులం బంగారం దేవుడెరుగు, అసలు ఇచ్చే లక్ష రూపాయలను కూడా కోర్టు స్టేల నెపంతో ఎగ్గొట్టే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ₹4,000 పింఛన్, వికలాంగులకు ₹6,000 పింఛన్, రైతు భరోసా, కౌలు రైతుల సహాయం, ఆడబిడ్డలకు స్కూటీలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి కీలక వాగ్దానాలను గాలికి వదిలేశారని పేర్కొన్నారు.అసెంబ్లీలో కేసీఆర్ మాట వినపడకుండా రోజులు గడవవు:ముఖ్యమంత్రి, కాంగ్రెస్ మంత్రులు తమ పరిపాలనా చేతగాక కేసీఆర్ గారిపై, బిఆర్ఎస్ నాయకత్వంపై మురికి భాషతో చిల్లర రాజకీయాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. కేసీఆర్ గారు ఇంట్లో ఉన్నా ఆయన పేరు తలవకుండా కాంగ్రెస్ ప్రభుత్వానికి రోజు గడవదని ఎద్దేవా చేశారు. అసెంబ్లీలో కేటీఆర్, హరీష్ రావుల ధాటికి తట్టుకోలేక ఆరుగురు మంత్రులను లేపి మాట్లాడించాల్సిన దుస్థితి కాంగ్రెస్‌దని అన్నారు. ప్రజల సొమ్ముతో విచ్చలవిడిగా ప్రచారాలు చేసుకుంటూ, పదవుల్లో లేని తమ కుటుంబ సభ్యులకు ఎస్కాట్‌లు, గన్‌మెన్లను కేటాయించుకుంటూ ఉదా ఖర్చులు చేస్తున్నారని విమర్శించారు.ర్యాలీలు, ధర్నాలను విజయవంతం చేయాలి:మిగిలి ఉన్న సమాయంలోనైనా చిల్లర మాటలు మానుకొని 6 గ్యారెంటీలను, 420 హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రేపు నియోజకవర్గ కేంద్రాల్లో ర్యాలీలు, ఎమ్మార్వో కార్యాలయాల ముందు ధర్నాలు చేపడతామని, వారం రోజుల పాటు మోసపోయిన ప్రతి వర్గం తరపున నిరసన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. మధిరలో పెద్ద ఎత్తున జరగబోయే ఈ నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో బిఆర్ఎస్ నాయకులు బిక్కి కృష్ణ ప్రసాద్, చిత్తారు నాగేశ్వరరావు, రావూరి శ్రీనివాసరావు, కనుమూరు వెంకటేశ్వరరావు, అరిగ శ్రీనివాసరావు, అప్పారావు, బొగ్గుల భాస్కర్ రెడ్డి, చావా వేణు, రంగిశెట్టి కోటేశ్వరరావు, ఆళ్ల నాగబాబు, ఉమామహేశ్వరరావు, నాగులవంచ రామారావు, కోన నరేంద్ర చిదిరాల, అబ్దుల్ ఖురేషి తదితరులు పాల్గొన్నారు.

## వెల్టూర్ గ్రామ ఉపసర్పంచ్ పవిత్ర మృతి.. కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్



**సంగారెడ్డి, సెప్టెంబర్ 01, నేటి శుభోదయ :**
సదాశివపేట మండలం వెల్టూర్ గ్రామ ఉపసర్పంచ్ నాయి కోటి పవిత్ర అనారోగ్యంతో గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలుసుకున్న సంగారెడ్డి నియోజకవర్గ శాసనసభ్యులు చింత ప్రభాకర్ వెల్టూర్ గ్రామానికి వెళ్లారు.ఈ సందర్భంగా పవిత్ర మృతదేహానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్ .. కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. పవిత్ర మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ, కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తొంట కిష్టయ్య, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, సీనియర్ నాయకులు గడీల సుధీర్ రెడ్డి, మాజీ సర్పంచులు గడ్డమీద సత్యనారాయణ, పబ్బతి లక్ష్మారెడ్డి, యాదయ్య, మధు, పాపయ్య, వార్డు సభ్యులు, గ్రామ బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ కార్పొరేటర్ సరిపూడి రమాదేవి ఓటు గల్లంతు

**ఖమ్మం, సెప్టెంబర్ 1 , నేటి శుభోదయ :**
ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సర్ –2026 ప్రక్రియలో అధికారుల నిర్లక్ష్యం వెలుగులోకి వచ్చింది. కవిరాజ్ నగర్‌లో నివాసం ఉంటున్న 11వ డివిజన్ మాజీ కార్పొరేటర్ సరిపూడి రమాదేవి ఓటు, ఎన్యుమరేషన్ ఫారం స్వీకరించి అక్నాలెడ్జ్‌మెంట్ ఇచ్చినప్పటికీ డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాలో కనిపించకపోవడం కలకలం రేపుతోంది. ప్రస్తుత, మాజీ ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, శాశ్వత నివాసుల ఓట్లను 100 శాతం గుర్తించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలనే ఆదేశాల మేరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించినప్పటికీ తన ఓటు నమోదు చేయడంలో డివిజన్ సూపర్వైజర్ దివ్య (టిపిబిఓ) నిర్లక్ష్యం వహించారని రమాదేవి ఆరోపించారు. ఫారం తీసుకుని అక్నాలెడ్జ్‌మెంట్ ఇచ్చిన అనంతరం తాను ఫోన్ చేసినా సూపర్వైజర్ నుంచి సరైన స్పందన లేదని పేర్కొన్నారు.మాజీ ప్రజాప్రతినిధి ఓటునే కాపాడలేని అధికారులు సామాన్యుల ఓట్లను ఎలా కాపాడతారని ఆమె ప్రశ్నించారు. ప్రతిపక్షాల ఒత్తిడితోనే తన ఓటును ఉద్దేశపూర్వకంగా తొలగించారనే అనుమానం వ్యక్తం చేస్తూ సూపర్వైజర్ దివ్య, బిఎల్ఓ శోభపై చర్యలు తీసుకోవాలని, తన ఓటును పునరుద్ధరించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## అర్హులైన ప్రతి బీడీ కార్మికురాలికి చేయూత పెన్షన్ఇవ్వాలి





**నిజామాబాద్ రూరల్ ధర్పల్లి, సెప్టెంబర్ 01, నేటి శుభోదయ :**
అర్హులైన ప్రతి బీడీ కార్మికురాలికి "చేయూత పెన్షన్ " ఇవ్వాలని దర్పల్లిలో సెప్టెంబర్ 5న, ధర్నాను చేపట్టినట్టు భీడికార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని తెలంగాణ ప్రజల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ రమేష్ పిలుపునిచ్చారు రు. ధర్పల్లి మండల కేంద్రంలో మంగళవారం నాడు ఆయన పత్రిక విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో రాకముందు ఎన్నికల ముందు కెసిఆర్ ప్రభుత్వం బీడీ కార్మికులకు కటాఫ్ డేట్ పెట్టి రాకుండా బీడీ కార్మికుల పొట్ట కొట్టారని తాము అధికారంకు రాగానే కటాఫ్ డేట్ ఎత్తివేసి ప్రతి బీడీ కార్మికురాలికి చేత ద్వారా ₹400 పెన్షన్ అందజేస్తామని గెలిచినక బీడీ కార్మికులకు మొండి చేయి చూపారని ఆయన విమర్శించారు. ప్రభుత్వం ఇప్పటికైనా బీడీ కార్మికుల పరిస్థితిని లెక్కలోకి తీసుకొని వారికి ఎలాంటి ఆంక్షలు కటాఫ్ డేటు లేకుండా అందరికీ చేయూత ద్వారా పెన్షన్ అందజేయాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు కే రాజేశ్వర్, జిల్లా నాయకులు ఎస్ కిషోర్, తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ ధర్పల్లి మండల కమిటీ అధ్యక్షులు ఆశన్న, సిపిఐ ఎంఎల్ మాస్ ల్యాండ్ డివిజన్ నాయకులు ఆర్ దామోదర్ లు పాల్గొన్నారు.

## పోటీ పరీక్షల్లో విజయం సాధించేందుకు పట్టుదలతో కృషి చేయాలి

- **ప్రభుత్వం అందిస్తున్న ఉచిత ఫౌండేషన్ శిక్షణను సద్వినియోగం చేసుకుని బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలి**
  **: జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**




**సంగారెడ్డి , సెప్టెంబర్ 01, నేటి శుభోదయ :**
పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులు కష్టపడి చదువుతూ, పట్టుదల, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే అనుకున్న లక్ష్యాలను తప్పకుండా సాధించగలరని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత శిక్షణ, స్టడీ మెటీరియల్, ఇతర సదుపాయాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుని తమ భవిష్యత్తును బంగారు భవిష్యత్తుగా తీర్చిదిద్దుకోవాలని ఆయన సూచించారు.వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సంగారెడ్డి బీసీ స్టడీ సర్కిల్‌లో గ్రూప్–1, గ్రూప్–2, గ్రూప్–3, గ్రూప్–4, ఆర్ఆర్‌బీ, బ్యాంకింగ్, పోలీస్ తదితర పోటీ పరీక్షలకు సంబంధించి ఐదు నెలల ఉచిత ఫౌండేషన్ శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ముఖ్య అతిథిగా హాజరై శిక్షణ పొందుతున్న విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి పోటీ పరీక్షకు పెద్ద సంఖ్యలో అభ్యర్థులు పోటీ పడుతున్నారని, అందువల్ల పోటీని చూసి నిరుత్సాహపడకుండా వంద శాతం శ్రమ, ఏకాగ్రత, పట్టుదలతో లక్ష్యం దిశగా ముందుకు సాగాలని సూచించారు. పోటీ పరీక్షలకు అవసరమైన నాలెడ్జ్‌ను పెంపొందించుకోవడంతో పాటు ప్రతిరోజూ నిర్ణీత సమయాన్ని కేటాయించి ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని అన్నారు.మీ భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉంది. పట్టుదలతో, ఆత్మవిశ్వాసంతో చదివితే విజయం సాధించడం సాధ్యమే అని కలెక్టర్ విద్యార్థులకు ఉద్బోధించారు. జీవితంలో ప్రతి రంగంలోనూ సమస్యలు, సవాళ్లు ఉంటాయని, వాటిని అధిగమించే మన దృక్పథంపైనే వాటి ప్రభావం ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు. సమస్యలను చూసి వెనుకడుగు వేయకుండా వాటిని అవకాశాలుగా మలుచుకుని ముందుకు సాగాలని సూచించారు.విద్యార్థులు తమ తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చేలా కష్టపడి చదవాలని, ప్రభుత్వం కల్పిస్తున్న ఇటువంటి అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉద్యోగాలను సాధించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. లక్ష్యాన్ని నిర్దేశించుకుని, దానిని సాధించే వరకు నిరంతరంగా కృషి చేయాలని, విజయం సాధించాలనే నమ్మకంతో ముందుకు సాగాలని అన్నారు.అనంతరం కలెక్టర్ బీసీ స్టడీ సర్కిల్‌లోని క్లాస్‌రూమ్‌లు, స్టడీ మెటీరియల్, విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు, అధ్యయన వాతావరణాన్ని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన శిక్షణ అందేలా చూడాలని, అవసరమైన స్టడీ మెటీరియల్‌ను అందుబాటులో ఉంచాలని, స్టడీ సర్కిల్‌లోని సదుపాయాలను మరింత మెరుగుపరచాలని నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.ఈ ఐదు నెలల ఉచిత ఫౌండేషన్ శిక్షణ ద్వారా వివిధ పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు పరీక్షల విధానం, సిలబస్, ప్రాథమిక అంశాలు, సాధారణ అవగాహన తదితర అంశాల్లో అవసరమైన మార్గదర్శకత్వం లభించనుందని బిసి సంక్షేమ అధికారి జగదీష్ తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి జగదీష్, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రవీణ్, శిక్షకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## ఏఐయుకెఎస్ ఆర్మూర్ డివిజన్ ప్రధాన కార్యదర్శిగా రిక్క దామోదర్, ఉపాధ్యక్షుడిగా నారగౌడ్ ఏకగ్రీవ ఎన్నిక





**నిజామాబాద్ రూరల్ సిరికొండ, సెప్టెంబర్ 01, నేటి శుభోదయ :**
అఖిల భారత ఐక్య రైతుసంఘం ( ఏ ఐ యూ కె ఎస్ ) ఆర్మూర్ డివిజన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమ్మర్‌పల్లిలో నిర్వహించిన జనరల్ కౌన్సిల్ సమావేశంలో ఈ ఎన్నిక ప్రక్రియ ముగిసినట్లు ఏఐయుకెఎస్ జిల్లా కోశాధికారి ఎం. లింబాద్రి మంగళవారం తెలిపారు.డివిజన్ ప్రధాన కార్యదర్శి గ రిక్క దామోదర్ (రావుట్ల గ్రామం, సిరికొండ మండలం)డివిజన్ ఉపాధ్యక్షుడు గ ఎం. నారగౌడ్ (గడ్కోల్ గ్రామం, సిరికొండ మండలం) డివిజన్ సభ్యులుగా బట్టు సర్పంచ్ సాయులునూతన ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన రిక్క దామోదర్ గతంలో సుదీర్ఘకాలం పాటు పిడిఎస్ యూ విద్యార్థి సంఘంలో, ఆ తర్వాత (పి వై ఎల్ ) యువజన సంఘంలో చురుగ్గా పనిచేశారని తెలిపారు. అలాగే సిపిఐ (ఎంఎల్ ) మాస్ లైన్ పార్టీలో సీనియర్ నాయకునిగా పనిచేసిన అనుభవం ఆయనకు ఉందని పేర్కొన్నారు.ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన ఎం. నారగౌడ్ సిపిఐ (ఎంఎల్ ) మాస్ లైన్ సీనియర్ నాయకుడిగా సేవలందిస్తూ, గత 20 సంవత్సరాలుగా రైతు పోరాటాలలో కీలక పాత్ర పోషించారని లింబాద్రి కొనియాడారు. వీరి అనుభవం ఆర్మూర్ డివిజన్‌లో రైతు సమస్యల పరిష్కారానికి, సంఘ బలోపేతానికి ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు

## సామాజిక సేవలకు బాణోత్ వెంకటేష్‌కు డాక్టరేట్






**ఖమ్మం, సెప్టెంబర్ 1, నేటి శుభోదయ :**
ఖమ్మం నగరానికి చెందిన ఉద్యోగి భాణోత్ వెంకటేష్ కు డాక్టరేట్ లభించింది. దేవాలయాల అభివృద్ధికి, పేద విద్యార్థులకు, వృద్ధులకు సేవలు అందించడం, పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందిస్తూ, మారుమూల గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తూ, తలసేమియా బాధితులకు రక్తదానం చేస్తూ సామాజిక సేవలో విశేష కృషి చేస్తున్న బాణోత్ వెంకటేష్‌కు గౌరవ డాక్టరేట్ లభించింది. హైదరాబాదులోని ఏషియన్ ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ వేదికపై భానోత్ వెంకటేష్ కు ఆదివారం యూనివర్సిటీ వైస్ ఛాన్స్లర్ డాక్టర్ ఎం జిన్ను రామశర్మ చేతుల మీదుగా గౌరవ డాక్టరేట్ ను అందుకున్నారు.ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం సంధ్యాతండా గ్రామానికి చెందిన బాణోత్ వెంకటేష్, బాణోత్ మోదీన్ కుమారుడు. ప్రస్తుతం ఖమ్మం నగరంలోని శ్రీ హవిషా హాస్పిటల్‌లో ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నారు. ఉద్యోగ బాధ్యతలతో పాటు తన సొంత ఖర్చులతో పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్నారు.మారుమూల ప్రాంతాల్లో ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహించడం, ఆర్థికంగా వెనుకబడిన వారికి ఉచితంగా వైద్య సేవలు, మందులు అందించడం, దేవాలయాల నిర్మాణానికి ఆర్థిక సహాయం, పేద విద్యార్థుల చదువులకు ఆర్థిక సహాయం అందించడం, తలసేమియా బాధితులకు అవసరమైన సమయంలో రక్తదానం చేయడం వంటి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు.సామాజిక సేవా రంగంలో ఆయన అందిస్తున్న విశిష్ట సేవలను గుర్తించి బాణోత్ వెంకటేష్‌కు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, స్నేహితులు, పలువురు ప్రముఖులు ఆయనకు అభినందనలు తెలిపారు.

# ఉద్యోగ జీవితంలో పదవీ విరమణ అనేది సహజం.

- **ఎల్లయ్య హోమ్‌గార్డ్ పోలీసు శాఖకు అందించిన సేవలు అభినందనీయం.**
- **పదవీ విరమణ పొందుతున్న ఎల్లయ్యను ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్.**



**సంగారెడ్డి, సెప్టెంబర్ 1, నేటి శుభోదయ :** తేది 01.09.2026 నాటికి 60 సంవత్సరాలు పూర్తి చేసుకుని పదవీ విరమణ పొందుతున్న ఎల్లయ్య హోమ్‌గార్డ్ను జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్. ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. ఉద్యోగ జీవితంలో పదవీ విరమణ అనేది సహజమని, ఉద్యోగ కాలంలో అందించిన సేవలు ఎల్లప్పుడూ గుర్తుండిపోతాయని అన్నారు. ఎల్లయ్య గత 35 సంవత్సరాలుగా ఉమ్మడి మెదక్ జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహిస్తూ పోలీసు శాఖకుఉత్తమ సేవలను అందించారని, వారి సేవలను కొనియాడారు. పదవీ విరమణ అనంతరం కూడా పోలీసు శాఖ తరపున ఎల్లయ్యకు, ఆయన కుటుంబ సభ్యులకు ఎల్లవేళలా అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని జిల్లా ఎస్పీ తెలిపారు. పదవీ విరమణ అనంతరం ఆయన కుటుంబంతో సుఖసంతోషాలతో, ఆరోగ్యంగా జీవించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో హోమ్‌గార్డ్ కమాండెంట్ ఆర్. వెంకటేశ్వర్లు, ఏఆర్ డీఎస్పీ నరేందర్, ఆర్ఐ డానియెల్, పదవీ విరమణ పొందుతున్న ఎల్లయ్య కుటుంబ సభ్యులు, హోమ్‌గార్డ్ ప్రెసిడెంట్ జితేందర్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

# సంచార జాతులకు ప్రభుత్వమే ఆత్మగౌరవ భవనాలు నిర్మించి ఇవ్వాలి

- **ప్రతి కులానికి ప్రత్యేక భవనం ఏర్పాటు చేయాలి : సంచార జాతుల నాయకుల డిమాండ్**




**ఖమ్మం, సెప్టెంబర్ 1, నేటి శుభోదయ :** విముక్తి జాతుల దినోత్సవం సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ, ఖమ్మం జిల్లా ఆధ్వర్యంలో ఖమ్మం ఐడిఓసి కాంప్లెక్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సంచార జాతుల నాయకులు పాల్గొని ప్రభుత్వానికి పలు డిమాండ్లు చేశారు.ఈ కార్యక్రమానికి సంచార జాతుల ఖమ్మం జిల్లా అధ్యక్షులు వల్లెపు సోమరాజు అధ్యక్షత వహించారు. డా. కె.వి. కృష్ణారావు , డెరంగుల బ్రహ్మం ప్రధాన వక్తలుగా పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా వల్లెపు సోమరాజు మాట్లాడుతూ సంచార జాతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని అన్నారు. సంచార జాతులకు చెందిన ప్రతి కులానికి ప్రభుత్వమే స్థలం కేటాయించి, ఆత్మగౌరవ భవనాలను నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు.డా. కె.వి. కృష్ణారావు మాట్లాడుతూ సంచార జాతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలని అన్నారు. ఆత్మగౌరవ భవనాలు కేవలం సమావేశాల కోసం మాత్రమే కాకుండా ఆయా కులాల సంస్కృతి, సంప్రదాయాలు, చరిత్రను భవిష్యత్ తరాలకు అందించే కేంద్రాలుగా తీర్చిదిద్దాలని కోరారు.డెరంగుల బ్రహ్మం మాట్లాడుతూ సంచార జాతుల పట్ల ప్రభుత్వానికి ప్రత్యేక బాధ్యత ఉందన్నారు. ప్రతి కులానికి ఆత్మగౌరవ భవనం నిర్మించి ఇవ్వడంతో పాటు, వాటి నిర్వహణకు కూడా ప్రభుత్వం తగిన నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.–**-- నాయకుల ప్రధాన డిమాండ**

్లసంచార జాతులకు చెందిన ప్రతి కులానికి ప్రభుత్వమే ఆత్మగౌరవ భవనం నిర్మించి ఇవ్వాలి.ఆత్మగౌరవ భవనాల కోసం ప్రభుత్వమే స్థలం కేటాయించాలి.భవనాల నిర్మాణానికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి.ఆయా కులాల చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించే విధంగా భవనాలను అభివృద్ధి చేయాలి.భవనాల నిర్వహణకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలి.సంచార, విముక్త జాతుల అభివృద్ధికి ప్రత్యేక సంక్షేమ ప్రణాళిక రూపొందించాలి.సంచార జాతుల యువతకు విద్య, ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలి.నామినేటెడ్ పదవుల్లో సంచార జాతులకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలి."ఆత్మగౌరవ భవనం అనేది కేవలం ఒక భవనం కాదు——ప్రతి సంచార జాతి కులం యొక్క చరిత్ర, సంస్కృతి, ఐక్యతకు ప్రతీక. అందుకే వాటిని ప్రభుత్వమే నిర్మించి ఇవ్వాలి" అని నాయకులు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పొదిలి నరసింహారావు, పూసల షేక్ మస్తాన్, గారడీ సాయిబు, పఠాన్ బడే ఖాన్, బత్తుల గోపాల్, ఒర్సు కృష్ణ, మల్లూరు కృష్ణయ్య, బాలేఘాట్ నరసింహారావు తదితర ముఖ్య అతిథులు పాల్గొన్నారు.అలాగే చల్లా యాలద్రి, వల్లెపు హరిష్, నాగేశ్వరరావు, రాము, ఉపేందర్, రాములు, పెనుగొండ వీరయ్య, వెంకన్న, వేముల వెంకటనారాయణ, సర్వేశ్, ఎడుకొండలు, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు తదితర సంచార జాతుల ప్రతినిధులు పాల్గొన్నారు.

# రాహుల్‌పై కేసులు ఎత్తేయాలి

- **బీజేపీకి అయూబ్ డిమాండ్**



**వరంగల్, సెప్టెంబర్ 1, నేటి శుభోదయ :** ప్రజాస్వామ్య స్వరాన్ని అణచివేసే ప్రయత్నాలను సహించబోమని, కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై రాజకీయ కక్షతో కేసులు నమోదు చేయడం సరికాదని వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ అన్నారు. కేసులను వెంటనే ఉపసంహరించుకుని బీజేపీ బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.ఉత్తరప్రదేశ్‌లో రాహుల్ గాంధీపై కేసుల నమోదును నిరసిస్తూ టీపీసీసీ ఆదేశాల మేరకు వరంగల్ జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో మంగళవారం వరంగల్ నగరంలోని వెంకట్రామ జంక్షన్ వద్ద భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని రాహుల్ గాంధీకి మద్దతుగా నినాదాలు చేశారు.ఈ సందర్భంగా అయూబ్ మాట్లాడుతూ.. ప్రజల తరపున ప్రశ్నిస్తున్న రాహుల్ గాంధీ గొంతును కేసులతో అణచివేయాలని చూడటం ప్రజాస్వామ్యంపై దాడి అని అన్నారు. రైతులు, యువత, మహిళలు, పేదలు, సామాన్య ప్రజల సమస్యలను రాహుల్ గాంధీ పార్లమెంట్‌లో, ప్రజాక్షేత్రంలో బలంగా వినిపిస్తున్నారని తెలిపారు.ప్రతిపక్షానికి ప్రశ్నించే హక్కు ఉందని, అధికారంలో ఉన్నవారు ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించాలన్నారు. ఎన్ని కేసులు పెట్టినా రాహుల్ గాంధీ ప్రజా పోరాటాన్ని ఆపలేరని, దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు ఆయనకు అండగా నిలుస్తాయని అయూబ్ స్పష్టం చేశారు."కాంగ్రెస్ పార్టీ పోరాటం వ్యక్తుల కోసం కాదు.. ప్రజాస్వామ్యం, రాజ్యాంగ పరిరక్షణ, ప్రజల హక్కుల కోసం" అని పేర్కొన్నారు. కేంద్ర, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాలు కక్ష సాధింపు ధోరణిని విడనాడి రాహుల్ గాంధీపై కేసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్ సంఘ్ వెంకటరాజ్యం, జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ చిలువేరు శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొరివి పరమేష్, మాజీ కార్పొరేటర్ గుండేటి నరేందర్, జిల్లా కాంగ్రెస్ నాయకులు నల్లొండ రమేష్, వర్ధన్నపేట మండల అధ్యక్షుడు పోశాల వెంకన్న, వర్ధన్నపేట టౌన్ అధ్యక్షుడు ఈగ దామోదర్, 3వ డివిజన్ అధ్యక్షుడు జన్ను అరుణ్‌కర్, 14వ డివిజన్ అధ్యక్షుడు సయ్యద్ ఇంతియాజ్, 21వ డివిజన్ అధ్యక్షుడు కొమ్ముల సందీప్, 43వ డివిజన్ అధ్యక్షుడు మాడుగుల రాజ్‌కుమార్, కొమ్ముల ప్రదీప్, మాజీ మండల అధ్యక్షులు జాటోత్ శ్రీనివాస్ నాయక్, ఎద్దు సత్యంతో పాటు ప్రజాప్రతినిధులు, జిల్లా, మండల, యూత్, మహిళా, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సెల్ నాయకులు, మండల, టౌన్, డివిజన్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పెన్షన్ విద్రోహ దినం" నిరసన కార్యక్రమం

## - సిపిఎస్ రద్దుచేసి ఓ పి ఎస్ వెంటనే పునరుద్ధరించాలి







**నిజామాబాద్ రూరల్ సిరికొండ, సెప్టెంబర్ 01, నేటి శుభోదయ :** నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలంలోని రావుట్ల జిల్లా పరిషత్ మరియు ప్రాథమిక పాఠశాలలలో "పెన్షన్ విద్రోహ దినం" నిరసన కార్యక్రమం...జరిగింది మరియు సిపిఎస్ రద్దుచేసి ఓ పి ఎస్ వెంటనే పునరుద్ధరించాలి అని టీజీఈ జేఏసీ నాయకులు ఎం. బాలయ్య సిరికొండ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చీమన్ పల్లి లో★"పెన్షన్ విద్రోహ దినం" నిరసన కార్యక్రమంలో టీ.జి. ఇ జేఏసీ జిల్లా కో చైర్మన్ ఎం బాలయ్య మాట్లాడుతూ ఉద్యోగుల పాలిట శాపమైన నూతన పెన్షన్ విధానం రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వి .శ్రీనివాస్, నాయకులు గంగదాసు, ఎం. జవహర్ లాల్, రవి, బాలాజీ, సతీష్ గంగాధర్, నరేష్ ,ప్రేమ్, గజన్ రావు, గంగాధర్ బి. దేవి సింగ్, కె.రవి, సుధీర్, ఉమా శేఖర్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజేత,ఉపాధ్యాయులు పోశెట్టి, వీణ, శివాని తదితరులుపాల్గొన్నారు

# భారీగా బయలుదేరిన పిఆర్టియు ఉపాధ్యాయులు






**ఖమ్మం, సెప్టెంబర్ 1, నేటి శుభోదయ :** ఉపాధ్యాయుల ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం సెప్టెంబర్ 1న హైదరాబాదులోని ఇందిరాపార్క్ వద్ద తలపెట్టిన ధర్నాలకు ఖమ్మం జిల్లా నుండి ఉపాధ్యాయ టిఆర్టి శ్రేణులు అధిక సంఖ్యలో బయలుదేరారు. ప్రభుత్వం ఏర్పడి మూడు సంవత్సరాల దాటిన ఉపాధ్యాయుల ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకుండా పిఆర్సినములు చేయకుండా ఆర్డీఏలను పెండింగ్లో ఉంచి సిపిఎస్ విధానాన్ని రద్దు చేయకుండా ఉద్యోగులను మానసిక వేదన గురి చేస్తున్నటువంటి విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యక్షంగా తెలియజేయడం కోసమే ఈ మహాదాన ఏర్పాటు చేయడమైనది. గతంలో అనేక సందర్భాల్లో చర్చలు జరిపి కొంత సమయం కావాలి మీ సమస్యలను పరిష్కరిస్తాము అని హామీ ఇచ్చినప్పటికీ సమస్యలు పరిష్కారములు చెప్పుశుద్ధి లేనందున టిఆర్టియు ప్రత్యక్షములను పోనికొన్నది. ఈ ధర్నాకు ముఖ్య అతిథిగా గౌరవ శాసనమండలి సభ్యులు పిల్లలు గోపాల్ రెడ్డి అదే విధంగా రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దామోదర్ రెడ్డి, శంకర్ బిక్షం గౌడ్, వివిధ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున టిఆర్టి శ్రేణులు ధర్నాలో పాల్గొంటారు అని ఖమ్మం జిల్లా అధ్యక్షులు కట్టా శేఖర్రావు, ప్రధాన కార్యదర్శి ఆర్ రంగారావు, జాతి నాయకులు చిత్రాలు ప్రసాద్ ఒక ప్రకటనలో తెలియజేశారు.

# అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**ఖమ్మం, సెప్టెంబర్ 1, నేటి శుభోదయ :** స్థానిక ఎస్ ఆర్ బిజిఎన్ఆర్ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకులుగా ఎకనామిక్స్, హెల్త్ సైన్స్, స్టాటిస్టిక్స్ లో బోధించడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.మొహ్మద్ జాకిరుల్లా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.అర్హులైన అభ్యర్థులు ఈనెల 3వతేది గురువారం సాయంత్రం 5గంటలవరకు కళాశాల కార్యాలయం లో సంబంధిత ధృవీకరణ పత్రాల జిరాక్సులతో అందజేయాలని సూచించారు.ఇంటర్వ్యూలు 5వతేది శనివారం నాడు ఉదయం 11గంటలనుండి నిర్వహిస్తామని వెల్లడించారు. కళాశాల విద్యా కమిషనర్ ఉత్తర్వులననుసరించి అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులలో బి.సి,ఓ.సీలు 55శాతం,ఎస్.సి,ఎస్.టీలు 50 శాతం మార్కులతో పాటు అదనపు అర్హతలైన నెట్, సెట్, పిహెచ్.డి కలిగి ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు.ఇంటర్వ్యూలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు.

నేటి శుభోదయ
బుధవారం | హైదరాబాద్
02 - 09 - 2026
www.netisubhodaya.com


## ప్రజల కోరిక మేరకు ముత్యాలమ్మ ఆలయంలో ఫ్లోరింగ్ పనులు



**ఖమ్మం, సెప్టెంబర్ 1, నేటి శుభోదయ :**
ఖమ్మం నగరంలో గల ఆరవ డివిజన్‌లోని పాత ఢిల్లీ పబ్లిక్ స్కూల్ రోడ్డులో ఉన్న ముత్యాలమ్మ ఆలయంలో ఫ్లోరింగ్ ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు 6వ డివిజన్ మాజీ కార్పొరేటర్ నాగండ్ల కోటేశ్వరరావు ని కోరారు.ప్రజల విజ్ఞప్తికి తక్షణమే స్పందించిన నాగండ్ల కోటేశ్వరరావు తన సొంత ఖర్చులతో ముత్యాలమ్మ ఆలయంలో ఫ్లోరింగ్ పనులను చేపట్టి పూర్తి చేయించారు.ఆలయంలో ఫ్లోరింగ్ పనులు పూర్తికావడంతో స్థానిక ప్రజలు, భక్తులు ఆనందం వ్యక్తం చేస్తూ నాగండ్ల కోటేశ్వరరావు కి కృతజ్ఞతలు తెలిపారు . ప్రజల అవసరాలను గుర్తించి వెంటనే స్పందించి పనులు పూర్తి చేయడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

## నిరసన తెలిపిన కాంగ్రెస్ ఖమ్మం



**ముదిగొండ, సెప్టెంబర్ 1, నేటి శుభోదయ :**
మండల కేంద్రం ముదిగొండలోని ప్రధాన సెంటర్ లో రాహుల్ గాంధీ పై,నరేంద్ర మోడీ ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులకు నిరసిస్తూ రాస్తారోకో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు గుడిపూడి బుచ్చి రామయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్మినేని రమేష్ బాబు, ఉపాధ్యక్షులు పసుపులేటి దేవేందర్, మండల నాయకులు మహ్మద్ అజ్గర్, మల్లెల అజెయ్ , పిల్లుట్ల రాఘవ తదితరులు పాల్గొన్నారు.

## నిర్దవెల్లిలో వికసిత్ భారత్‌పై గ్రామ సభ



**కేశంపేట, సెప్టెంబర్ 1, నేటి శుభోదయ :**
మండల పరిధిలోని నిర్దవెల్లి గ్రామంలో మంగళవారం వికసిత్ భారత్ కార్యక్రమంపై గ్రామ సభ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ చెదురువెల్లి భాస్కర్ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సభకు ముఖ్యఅతిథిగా ఏపీవో అజీజ్ అహ్మద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా 2027–28 ఆర్థిక సంవత్సరానికి గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల గుర్తింపుపై ప్రధానంగా చర్చించారు. గ్రామ ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, రహదారులు, పారిశుధ్యం, తాగునీరు, ఇతర ప్రజా అవసరాలకు సంబంధించిన పనులను గుర్తించి, వాటికి ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు. ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని గ్రామాభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని ఏపీవో సూచించారు. గ్రామంలో ప్రజలకు అవసరమైన సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ సందర్భంగా సర్పంచ్ భాస్కర్ గౌడ్ మాట్లాడుతూ,, గ్రామ అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని అన్నారు. గ్రామ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను గుర్తించి, అందరి సహకారంతో వాటిని పూర్తి చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. అనంతరం గ్రామస్తులు తమ సమస్యలు, అవసరాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విజయ్ కుమార్, ఉపసర్పంచ్ సఫూర అమేర్, వార్డు సభ్యులు నాగరాజు, చంద్రయ్య, రమేష్ నాయక్, మంజుల జంగేశ్, రిజ్వాన బేగం మోహిజ్, వెంకటమ్మ మల్లయ్య, ఐకేపీ సీసీ పరంధాములు, అంగన్వాడీ టీచర్లు ప్రేమలత, సులోచన, ఫీల్ అసిస్టెంట్ జంగయ్య, వీవో గోపాల్, నాయకులు ముత్యాలు, చాకలి జంగయ్య, వాజీద్, బోడ మల్లేష్, రాజేందర్, గణపతి, నుజ్జు, సాయి, రైతులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి : టియస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు డిమాండ్

- **పెన్షన్ విద్రోహ దినోత్సవం సందర్భంగా నిరసన తెలియజేసిన ఉపాధ్యాయులు**

**ఖమ్మం, సెప్టెంబర్ 1, నేటి శుభోదయ :**
నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేస్తూ మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ సుదీర్ఘకాలం ప్రభుత్వ సర్వీస్ చేసిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెన్షన్ లేకుండా చేయటం దుర్మార్గమని ఆవేదన వెలిబుచ్చారు. ఒక్కరోజు ఎమ్మెల్యే, ఎంపీ గా పనిచేసినా జీవితాంతం పెన్షన్ వస్తుందని, 30 నుండి 40 సంవత్సరాలు ప్రభుత్వ సర్వీసు చేసిన ఉద్యోగులకు పెన్షన్ లేకపోవడం దారుణమని తక్షణమే పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. రిటైర్ అయిన తర్వాత భద్రంగా జీవించాలంటే నికరంగా పెన్షన్ ఇవ్వాల్సిన అవసరం ప్రభుత్వాలకు ఉందని పెన్షన్ అనేది బిక్ష కాదని ఉద్యోగి హక్కని తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం ఎన్నికల ముందు పాత పెన్షన్ ఇస్తామని ఉద్యోగుల ఓట్లు కొల్లగొట్టి అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలను అమలు చేయకుండా కాలయాపన చేయటం తగదని హితవు పలికారు. నూతన పెన్షన్ రద్దయ్యే వరకు సమరశీల పోరాటాలు నిర్వహిస్తామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించారు. జిల్లాలోని అనేక పాఠశాలల్లో మధ్యాహ్న భోజన విరామ సమయాల్లో వందలాది మంది ఉపాధ్యాయులు నిరసనలు వ్యక్తం చేశారని తెలియజేశారు. టియస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు రంజాన్, బుర్రి వెంకన్న, రాంబాబు , రాందాస్, షమి, పద్మ, నిర్మలాకుమారి, రామకృష్ణ , వలీ, నాగేశ్వరరావు, విజయ్, రోజా ఆయా పాఠశాలల వద్ద జరిగిన నిరసనల్లో పాల్గొన్నారు.







## మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు బ్రహ్మాకుమారీస్ ఆధ్వర్యంలో పవిత్ర రక్షాబంధన్

**సంగారెడ్డి, సెప్టెంబర్ 1, నేటి శుభోదయ :**
సమాజ పరిశుభ్రత కోసం నిరంతరం సేవలందిస్తున్న మున్సిపల్ పారిశుద్ధ్య శ్రామిక సోదర, సోదరీమణులకు ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం, సంగారెడ్డి శాఖ ఆధ్వర్యంలో పవిత్ర రక్షాబంధన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు మున్సిపల్ శ్రామికులకు రాఖీలు కట్టి, వారి నిస్వార్థ సేవలను అభినందించారు. సమాజ పరిశుభ్రత కోసం ప్రతిరోజూ కష్టపడుతున్న పారిశుద్ధ్య కార్మికులు సమాజ ఆరోగ్యానికి, పరిశుభ్రతకు కాపలాదారులు అని కొనియాడారు.రక్షాబంధన్ కేవలం రాఖీ కట్టుకునే పండుగ మాత్రమే కాదని, చెడు అలవాట్లను విడిచిపెట్టి పవిత్రత, ప్రేమ, శాంతి, పరస్పర గౌరవం మరియు సేవా భావంతో జీవించాలనే పవిత్ర సంకల్పానికి ప్రతీక అని కార్యక్రమంలో వివరించారు.నశాముక్త భారతం కోసం ప్రతిజ్ఞఈ కార్యక్రమంలో భారత ప్రభుత్వ నార్కోటిక్స్ విభాగం మరియు బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న “నశా ముక్త భారత్ అభియాన్” కార్యక్రమంలో భాగంగా వ్యసనాల వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు.అనంతరం కార్యక్రమానికి హాజరైన వారితో మత్తు పదార్థాలు మరియు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటామని, ఆరోగ్యకరమైన మరియు సంతోషకరమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములమవుతామని దృఢ ప్రతిజ్ఞ చేయించారు.అలాగే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు మనస్సును కూడా కోపం, అసూయ, ద్వేషం, అహంకారం వంటి ప్రతికూల భావాల నుంచి పరిశుభ్రంగా ఉంచుకోవాలని సందేశం ఇచ్చారు.రాజయోగ ధ్యానం ద్వారా అంతరంగ పరిశుభ్రతబ్రహ్మకుమారీస్ అందిస్తున్న రాజయోగ ధ్యానం ద్వారా మనస్సులో శాంతి, ప్రేమ, ఆనందం, పవిత్రత వంటి సానుకూల గుణాలను పెంపొందించుకోవచ్చని తెలిపారు.“పరిశుభ్రమైన నగరం ఎంత అందంగా ఉంటుందో, పరిశుభ్రమైన మనసు అంతకంటే అందమైన జీవితాన్ని ఇస్తుంది” అనే సందేశాన్ని ఈ సందర్భంగా అందించారు.ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ సంగారెడ్డి శాఖ తరపున సేవలందిస్తున్న అన్నపూర్ణ, రాధిక, రాజవర్ధన్ రెడ్డితో పాటు సంస్థ రెగ్యులర్ విద్యార్థులైన ఆంజనేయులు (రిటైర్డ్ మున్సిపల్ అధికారి), అంజయ్య (రిటైర్డ్ మండల విద్యాధికారి) తదితరులు పాల్గొన్నారు.కార్యక్రమం ముగింపులో సంగారెడ్డి పట్టణ ప్రజల ఆరోగ్యం, పరిశుభ్రత కోసం నిస్వార్థంగా సేవలందిస్తున్న ప్రతి మున్సిపల్ శ్రామిక సోదర, సోదరీమణులకు బ్రహ్మకుమారీస్ తరపున కృతజ్ఞతలు తెలిపారు.వారి కుటుంబాలలో ఆరోగ్యం, ఆనందం, శాంతి మరియు సంతోషం ఎల్లప్పుడూ నిండాలని ఆకాంక్షించారు.“శాంతి మనలో--- ప్రేమ మన మాటల్లో--- సేవ మన చేతల్లో--- పవిత్రత మన జీవితంలో ఉండాలి” అనే సందేశంతో కార్యక్రమాన్ని ముగించారు.ఇట్లు— ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయంసంగారెడ్డి శాఖఓం శాంతి 🙏




## నీరుకుళ్ళకు తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఇవ్వాలి

### - ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి చొరవ చూపాలి: ఆర్షం మధుకర్

**వరంగల్, సెప్టెంబర్ 1, నేటి శుభోదయ :**
పరకాల నియోజకవర్గం నీరుకుళ్ళ గ్రామానికి తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరు చేయాలని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర నాయకుడు ఆర్షం మధుకర్ డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి తన జన్మదిన సందర్భంగా తాను విద్యాభ్యాసం చేసిన నీరుకుళ్ల గ్రామంపై ప్రత్యేక దృష్టి సారించి పాఠశాలను మంజూరు చేయాలని కోరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి వరంగల్ జిల్లాలో నీరుకుళ్ళ కు ప్రత్యేక చారిత్రక గుర్తింపు ఉందని, గ్రామంలో విద్యనభ్యసించిన పలువురు పూర్వ విద్యార్థులు నేడు వివిధ ఉన్నత స్థానాల్లో ఉన్నారని తెలిపారు. గ్రామ విద్యాభివృద్ధికి పూర్వ విద్యార్థులు అన్ని విధాలుగా సహకరించేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో విద్యావకాశాలను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని, అందులో భాగంగా నీరుకుళ్ళకు తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరు చేస్తే విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని ప్రభుత్వ దృష్టికి సమస్యను తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు.స్కూల్ మంజూరు కోసం ఎంతవరకైనా పోరాడేందుకు సిద్ధంగా ఉన్నామని, గ్రామానికి పాఠశాల వచ్చే వరకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామని ఆర్షం మధుకర్ స్పష్టం చేశారు. నీరుకుళ్ళ గ్రామానికి విద్యారంగంలో తగిన ప్రాధాన్యత కల్పించాలని ఆయన కోరారు.

# బీఆర్ఎస్ పోరుబాటకు సన్నద్ధం

- **విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పిలుపు**



**ఖమ్మం, సెప్టెంబర్ 1, నేటి శుభోదయ :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1,000 రోజులు పూర్తవుతున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో పాటు, ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజా సమస్యలపై ప్రజల తరపున ప్రశ్నిస్తూ బీఆర్ఎస్ పార్టీ పోరుబాటకు శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలో పార్టీ పిలుపు మేరకు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో సెప్టెంబర్ 2వ తేదీ నుంచి 10వ తేదీ వరకు వివిధ నిరసన కార్యక్రమాలను నిర్వహించేందుకు పార్టీ శ్రేణులు సన్నద్ధమవుతున్నాయి.ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలకు మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1,000 రోజులు పూర్తవుతున్న సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీల అమలు తీరును, ప్రభుత్వ పరిపాలనా వైఫల్యాలను ప్రజలకు వివరించడంతో పాటు, ప్రజా సమస్యలపై ప్రజలను చైతన్యపరిచేందుకు బీఆర్ఎస్ పార్టీ తన పోరాటాన్ని మరింత ఉధృతం చేయడానికి కార్యాచరణ రూపొందించింది.ఇప్పటికే ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని అన్ని నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న నిరసన కార్యక్రమాలపై పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులకు మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ దిశానిర్దేశం చేశారు. పోరుబాటలో భాగంగా మొదటి రోజు నియోజకవర్గ కేంద్రాల్లో ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ ధర్నా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఖమ్మం నగరంలో నిర్వహించే ధర్నా కార్యక్రమంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌తో పాటు పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొననున్నారు.

# ఎమ్మెల్యే చింత ప్రభాకర్‌కు రాఖీ కట్టిన బ్రహ్మకుమారీస్, మైనార్టీ మహిళలు





**సంగారెడ్డి, సెప్టెంబర్ 1, నేటి శుభోదయ :** రాఖీ పౌర్ణమి సందర్భంగా సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆత్మీయత, సోదరభావం వెల్లివిరిసింది. బ్రహ్మకుమారీస్‌తో పాటు మైనార్టీ మహిళలు ఎమ్మెల్యే చింత ప్రభాకర్ కి రాఖీ కట్టి, రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.రాఖీ పండుగ అన్నాచెల్లెళ్ల అనుబంధానికి, ప్రేమాభిమానాలకు ప్రతీక అని చింత ప్రభాకర్ అన్నారు.బ్రహ్మకుమారీస్, మైనార్టీ మహిళలు ఎమ్మెల్యేకు రాఖీ కట్టి తమ ఆప్యాయతను చాటుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారితో ఆత్మీయంగా మాట్లాడారు..

# సర్ -2026 హియరింగ్ ప్రక్రియపై పోలింగ్ స్టేషన్లలో క్షేత్రస్థాయి పరిశీలన



**ఖమ్మం, సెప్టెంబర్ 1, నేటి శుభోదయ :** ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని వివిధ పోలింగ్ స్టేషన్లను అడిషనల్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ వాసం వెంకటేశ్వర్ రెడ్డి సందర్శించి పరిశీలించారు.ఈ సందర్భంగా సర్ –2026కు సంబంధించి కొనసాగుతున్న హియరింగ్ ప్రక్రియపై ఆయన అధికారులను, బిఎల్ఓ లను అడిగి వివరాలు తెలుసుకున్నారు. హియరింగ్ ప్రక్రియ ఏ విధంగా కొనసాగుతోంది, ఓటర్లకు నోటీసుల జారీ, సంబంధిత పత్రాల పరిశీలన తదితర అంశాలపై బిఎల్ఓలతో కలిసి క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించారు.హియరింగ్ ప్రక్రియను నిబంధనల ప్రకారం పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని, అర్హులైన ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

# బీఆర్ఎస్ నిరసన గళం

## -కాంగ్రెస్ పాలనపై నరేందర్ ఫైర్



**వరంగల్, సెప్టెంబర్ 1, నేటి శుభోదయ :** కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న పాలనపై బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని రాజశ్రీ గార్డెన్స్‌లో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమానికి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై ప్రభుత్వ విధానాలపై నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. హామీలను నెరవేర్చకుండా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ప్రజా సమస్యల పరిష్కారం, హామీల అమలు కోసం బీఆర్ఎస్ ప్రజల పక్షాన నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని నరేందర్ పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ శ్రేణులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

### బీఎస్పీ నాయకుడి బీఆర్ఎస్‌లో చేరిక



కార్యక్రమంలో బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) 20వ డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల శివ మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా నరేందర్ గులాబీ కండువా కప్పి పెండ్యాల శివను పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన శివకు నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ 19వ డివిజన్ అధ్యక్షుడు చిలువేరు పవన్, లడ్డు అభిషేక్, కిషోర్, కిరణ్ నాయక్, రంజిత్, రవి, జీకే సంపత్, 20వ డివిజన్ అధ్యక్షుడు మహమ్మద్ ఇక్బాల్ తో పాటు వరంగల్ తూర్పు నియోజకవర్గానికి చెందిన కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, మాజీ డివిజన్ అధ్యక్షులు, డివిజన్ ఇన్‌చార్జీలు, మహిళా నాయకులు, యువజన,విద్యార్థి, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# కేశంపేటలో తొమ్మిది గ్రామ పంచాయతీల్లో తొలి గ్రామసభలు



**కేశంపేట, నేటి శుభోదయ :** వికసిత్ భారత్ లక్ష్య సాధనలో భాగంగా గ్రామాల సమగ్ర అభివృద్ధి కోసం కేశంపేట మండలంలోని తొమ్మిది గ్రామ పంచాయతీల్లో మంగళవారం తొలి విడత గ్రామసభలు నిర్వహించారు. ప్రజల భాగస్వామ్యంతో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలను రూపొందించే ప్రక్రియను అధికారులు ప్రారంభించారు.గ్రామాల్లోని ప్రస్తుత పరిస్థితులు, మౌలిక వసతులు, అందుబాటులో ఉన్న వనరులు, అభివృద్ధి లోటుపాట్లు, ప్రజల అవసరాలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులను ఎంపిక చేసేందుకు గ్రామసభల్లో చర్చించారు. ముఖ్యంగా తాగునీరు, సాగునీరు, నీటి సంరక్షణ, రహదారులు, కాలువలు, పారిశుద్ధ్యం, ప్రజా అవసరాల భవనాలు, వ్యవసాయం, పశుపోషణ, మహిళా సంఘాల ద్వారా ఉపాధి, గ్రామీణ జీవనోపాధి వంటి అంశాలపై ప్రజల నుంచి సూచనలు స్వీకరించారు.వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు, నీటి నిల్వల అభివృద్ధి, పూర్తికాని పనులు, కొత్తగా చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలను గుర్తించారు. వికసిత్ భారత్ గ్రామ పంచాయతీ ప్రణాళికల కింద అనుమతించబడిన 318 రకాల పనులను దృష్టిలో ఉంచుకుని అవసరమైన పనులను ప్రణాళికలో చేర్చనున్నారు.సర్పంచుల అధ్యక్షతన జరిగిన గ్రామసభలను మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి. రవిచంద్ర కుమార్ రెడ్డి ఆధ్వర్యంలోని అధికారులు పర్యవేక్షించారు. ప్రజల సూచనల ఆధారంగా గ్రామాలను సమగ్రంగా అభివృద్ధి చేయడమే ప్రణాళికల ప్రధాన లక్ష్యమని అధికారులు తెలిపారు.

# ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి కోసం ఆయుష్య హోమం

## - ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ప్రత్యేక పూజలు

**పరకాల,సెప్టెంబర్ 1, నేటి శుభోదయ :** పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని శ్రీ భవాని కుంకుమేశ్వర ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు, ఆయుష్య హోమం నిర్వహించారు. ఆలయ చైర్మన్ కొలుగూరి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో ఉదయం 5 గంటలకు వేద మంత్రోచ్చారణల మధ్య హోమాన్ని ఘనంగా నిర్వహించారు.శ్రీ కోమల్లపల్లి సంపత్‌శర్మ ఆధ్వర్యంలో జరిగిన హోమంలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని



ఆకాంక్షిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు.ప్రజాసేవలో మరింత కాలం కొనసాగుతూ, నియోజకవర్గ అభివృద్ధికి మరింత కృషి చేయాలని ఆకాంక్షించారు. అనంతరం ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ఘనంగా అన్నప్రసాద వితరణ

- **జన్మదిన వేడుకల సందర్భంగా భక్తులకు అన్నదానం చేసిన కుటుంబ సభ్యులు**





**శామీర్‌పేట, సెప్టెంబర్ 1, నేటి శుభోదయ :** శామీర్‌పేట మండల కేంద్రంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళవారం అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి, అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు.ఈసీఐఎల్‌కు చెందిన పి.ఎస్. లిథిన్ అదిత్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన తల్లిదండ్రులు బి. శ్రీనివాస్, పి. షర్మిల తమ కుటుంబ సభ్యులతో కలిసి ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముందుగా శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అన్నప్రసాద వితరణ చేపట్టారు.శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయానికి దర్శనానికి వచ్చిన భక్తులతో పాటు ఆలయ పరిసరాల్లో ఉన్న భక్తులు, మాజీ ప్రజాప్రతినిధులు, స్థానికులు, రాజీవ్ రహదారి మీదుగా ప్రయాణిస్తున్న భక్తులు పెద్ద సంఖ్యలో అన్నప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. జన్మదిన వేడుకలను ఆడంబరాలకు దూరంగా ఆధ్యాత్మికత, సేవా కార్యక్రమాలతో నిర్వహించుకోవాలనే ఉద్దేశంతో అన్నదానం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అన్నదానం మహాదానంగా భావిస్తూ, అమ్మవారి ఆశీస్సులతో ప్రతి సంవత్సరం సేవా కార్యక్రమాలను కొనసాగించాలనే ఆకాంక్షను వ్యక్తం చేశారు. కార్యక్రమానికి హాజరైన భక్తులు నిర్వాహక కుటుంబ సభ్యులను అభినందించి, లిథిన్ అదిత్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## సంతాపూర్‌లో ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం

### - ఓటర్ల జాబితా పరిశీలనతో పాటు అవగాహన కల్పించిన అధికారులు



**కేశంపేట, సెప్టెంబర్ -01, నేటి శుభోదయ**

కేశంపేట మండలం సంతాపూర్ గ్రామంలో ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అధికారిగా విజయలక్ష్మి పాల్గొని ఓటర్ల జాబితాను పరిశీలిస్తూ, అవసరమైన సవరణలు చేపట్టారు. గ్రామంలోని అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా అధికారులు చర్యలు చేపట్టారు.ఈ సందర్భంగా అధికారులు ఓటర్లకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఓటర్లు తమ పేరు, చిరునామా, వయస్సు, ఇతర వివరాలను ఓటర్ల జాబితాలో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని సూచించారు. వివరాల్లో ఏవైనా తప్పులు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సవరణలు చేయించుకోవాలని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి పౌరుడు ఓటు హక్కును పొందేలా, ఎలాంటి పొరపాట్లు లేకుండా ఓటర్ల జాబితాను రూపొందించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరించారు.ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని, తమ ఓటు హక్కుకు సంబంధించిన వివరాలను పరిశీలించుకుని అవసరమైన మార్పులు, చేర్పులు, తొలగింపుల కోసం అధికారులను సంప్రదించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిపిఓ గిరీష్ కుమార్, సర్పంచ్ బర్కమ్ యాదయ్య, ఎండీ సాజిత్, కర్రెడ్ల నరేందర్ రెడ్డి, అశోక్, కావాలి కృష్ణయ్యతో పాటు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఖమ్మం లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం




**ఖమ్మం, సెప్టెంబర్ 1, నేటి శుభోదయ :** ఏ ఐ సి సి ఆదేశానుసారం టి పి సి అద్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ పిలుపు మేరకు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, అర్బన్ జిల్లా కార్పొరేషన్ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి ల ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించడం జరిగింది. లోక్ సభ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీపై దురుద్దేశపూర్వకంగా నమోదు చేసిన ఎఫ్ ఐ ఆర్ కు వ్యతిరేకంగా, ఉత్తరాఖండ్ లోని బీ జె పి కార్యకర్తలపై ఎఫ్ ఐ ఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన ర్యాలీ నిర్వహించారు. మంగళవారం లోక్ సభ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ పై దురుద్దేశపూర్వకంగా నమోదు చేసిన ఎఫ్ ఐ ఆర్ కు వ్యతిరేకంగా, ఉత్తరాఖండ్ లోని బీ జె పి కార్యకర్తలపై ఎఫ్ ఐ ఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, అర్బన్ జిల్లా కార్పొరేషన్ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి ల ఆధ్వర్యంలో శాసన మండలి మాజీ సభ్యులు బాలసాని లక్ష్మీనారాయణ, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, జిల్లా ఆర్ టి ఏ మెంబర్ గజ్జెల్లి వెంకన్న,జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పులిపాటి వెంకయ్య, ఏ ఐ సి సి సేవాదళ్ కో- ఆర్డినేటర్ చోటా బాబా,రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు బానోత్ బాలాజీ నాయక్,జిల్లా అనుబంధ సంఘ అధ్యక్షులు కొత్తా సీతారాములు, దొబ్బల సౌజన్య, వేజండ్ల సాయి కుమార్, సయ్యద్ గౌస్, మొక్కా శేఖర్ గౌడ్ పుచ్చకాయల వీరభద్రం, బొడ్డు బొందయ్య సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, విప్లవ కుమార్,మాజీ కార్పొరేటర్లు మలీదు వెంకటేశ్వరరావు,లకావత్ సైదులు నాయక్ మరియు శ్రేణులతో కలిసి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ నుండి జెడ్ పి సెంటర్ నందు గల డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహం వరకు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ , అర్బన్ జిల్లా కాంగ్రెస్ కార్పొరేషన్ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ లు మాట్లాడుతూ ఏ ఐ సి సి అద్యక్షులు మల్లిఖార్జున ఖర్గే హల్ద్వానీలో ర్యాలీ వేదిక వద్ద బీజేపీ ఆర్ ఎస్ ఎస్ కార్యకర్తలు జరిపిన అత్యంత హేయమైన మరియు కులతత్వ శుద్ధీకరణ ఆచారం కు కొనసాగింపుగా, లోక్ సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ ఒక పత్రికా సమావేశంలో , ఈ దుశ్చర్యకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఎఫ్ ఐ ఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ ధృడవైఖరిని తీసుకున్నారని,రాజ్యాంగ విలువలను తీవ్రంగా అవమానించిన వారిపై చర్యలు తీసుకోవడానికి బదులుగా బీజేపీ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పని చేస్తున్న ఉత్తరాఖండ్ పోలీసులు హల్ద్వానీ సిటీ కొత్వాలి పోలీసు స్టేషన్ లో రాహుల్ గాంధీపైదిగ్భ్రాంతికరంగా ఎఫ్ ఐ ఆర్ నమోదు చేశారని, కుల ఆధారిత వివక్షకు,దళితులపై జరుగుతున్న అఘాయిత్యాలకు వ్యతిరేకంగా మాట్లాడే ధైర్యం చేసిన వారిని అణచివేయడానికి ఉత్తరాఖండ్ రాష్ట్ర ప్రభుత్వం పూర్తి శక్తిని ప్రయోగిస్తామని నిరూపించారని, ఈ కక్ష పూరిత రాజకీయాలను తీవ్రంగా ఖండిస్తూ ,ఉత్తరాఖండ్ లోని దోషులైన బీజేపీ కార్యకర్తలపై తక్షణ న్యాయ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాబోవు రోజుల్లో విజ్ఞత గల ప్రజలు బిజెపి కి తగిన గుణపాఠం చెప్పాలని కోరారు.అదే విధంగా బీజేపీ వేదింపులకు భారత జాతీయ కాంగ్రెస్ భయపడదని,సామాజిక న్యాయం,రాజ్యాంగ సమానత్వం మరియు ప్రతి పౌరుని గౌరవం కోసం అవిశ్రాంతంగా కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటు జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యులు తూములూరి లక్ష్మీనరసింహారావు, కిలారు అనిల్ కుమార్, బండి మాధవరావు, బచ్చలకూర నాగరాజు,సహేలా జావేద్ , రాష్ట్ర యువజన కాంగ్రెస్ కార్యదర్శి జెర్రిపోతుల అంజనీ కుమార్,దామా స్వరూప, మూడుముంతల గంగరాజు యాదవ్, ముక్రం అలీ ఖాన్,శంకర్ నాయక్, పాటి నర్సయ్య,యాసబోయిన శ్రీశైలం , శ్రీలత,బ్రహ్మారెడ్డి, రంగా జనార్ధన్,కిలారు వెంకట రమణ,వేల్పుల మురళి, గజ్జి సూర్య నారాయణ, ఏలూరి రవికుమార్,కోసూరి ప్రసాద్, నరాల నరేష్,బాణాల లక్ష్మణ్, గుడవర్తి శ్రీనివాస్,బుర్లె లక్ష్మీనారాయణ, ఖాజా మురళి, గడ్డం వెంకటయ్య,మహమూద్, జహీర్, ఫరీద్ ఖాద్రి, రజీ భాయ్,వెంకట్రావు నాయక్ ,బండి నాగేశ్వర రావు,నల్లమోతు లక్ష్మయ్య,నల్లమోతు రవి, బడే మియా, జాని,బలుసు లక్ష్మీ,జొన్నలగడ్డ అరుణ తదితర నాయకులు పాల్గొన్నారు.

# పలు వార్డుల్లో అభివృద్ధి పారిశుధ్య పనుల పర్యవేక్షణ

## - మున్సిపల్ చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్





**మంథని, సెప్టెంబర్ -01, నేటి శుభోదయ :**

మంథని మున్సిపాలిటీ పరిధిలోని 7వ, 8వ, 9వ వార్డుల్లో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి, పారిశుధ్య పనులను మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్ పాలకవర్గ సభ్యులతో కలిసి పరిశీలించారు.8వ వార్డు పోచమ్మవాడలోని గురుకుల పాఠశాల సమీపంలో చేపడుతున్న నూతన డ్రైన్ల నిర్మాణ పనులను, అలాగే రావుల చెరువు కట్ట సుందరీకరణ పనులు, పారిశుధ్య పనులను చైర్మన్ పరిశీలించారు.స్థానిక ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని చేపడుతున్న డ్రైన్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందుబాటులోకి తీసుకురావాలని చైర్మన్ సంబంధిత అధికారులకు సిబ్బందికి సూచించారు. డ్రైన్ల నిర్మాణం పూర్తయితే మురుగునీరు నిల్వ ఉండకుండా, వర్షాకాలంలో ప్రజలు ఎదుర్కొనే ఇబ్బందులు తగ్గడంతో పాటు పరిసర ప్రాంతాల్లో పారిశుధ్యం మరింత మెరుగుపడుతుందని తెలిపారు. రావుల చెరువు కట్ట సుందరీకరణ పనులను పరిశీలిస్తూ, పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పారిశుధ్య పనులు నిరంతరం కొనసాగిస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. మంథని మున్సిపాలిటీ పరిధిలో ప్రతి వార్డులో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పించేందుకు ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి పనులను కొనసాగిస్తున్నామని మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్ పేర్కొన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ లేకుండా, నిర్ణీత ప్రమాణాల మేరకు పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ పాలకవర్గ సభ్యులు లైశెట్టి రజిత, మారుపాక నిహారిక, నాయకులు జంబోజు సమ్మయ్య, స్థానిక ప్రజలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# వెల్జాల్ సబ్ స్టేషన్ రోడ్డుకు విముక్తి: వాహనదారుల కష్టాలు తీర్చిన వెల్జాల్ సర్పంచ్

- **వెల్జాల్ సర్పంచ్ వానరాసి రాములమ్మ**



**తలకొండపల్లి, సెప్టెంబర్ 1, నేటి శుభోదయ :** తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామ శివారులోని విద్యుత్ సబ్ స్టేషన్ ప్రధాన రహదారికి ఎట్టకేలకు మోక్షం లభించింది. గుంతలు, బురదమయంగా మారి రైతులు,వాహనదారులు పడుతున్న ఇబ్బందులపై గ్రామ సర్పంచ్ వానరాసి రాములమ్మ, తనయుడు వానరాశి వెంకటేష్ తక్షణమే స్పందించారు. జేసీబీ ద్వారా మొరము పోయించి రోడ్డును పూర్తిగా సమతలం చేయించారు.ఈ సందర్భంగా వానరాసి వెంకటేష్ మాట్లాడుతూ.."చాలా రోజులుగా ఈ బురద రోడ్డు వల్ల రైతులు, సబ్ స్టేషన్ సిబ్బంది పడుతున్న నరకయాతనను చూసి తట్టుకోలేకపోయాం.అందుకే పంచాయతీ నిధులతో ఈ తాత్కాలిక మరమ్మతులు చేయించాం. రాబోయే రోజుల్లో ఈ దారికి శాశ్వత బీటీ రోడ్డు మంజూరయ్యేలా పైఅధికారులతో మాట్లాడి శ్రమిస్తాం. గ్రామ అభివృద్ధి,ప్రజా సమస్యల పరిష్కారమే మా మొదటి ప్రాధాన్యత" అని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ సర్పంచ్ విజయలక్ష్మి విజయ్ కుమార్, వార్డు సభ్యులు శ్రీరామ్, సుభాన్, శ్రీశైలం,గణేష్, నాయకులు రాజుగుప్తా,సంపత్ కుమార్,శేఖర్, పాండు,పంచాయతీ కార్యదర్శి వాజిద్, సబ్ స్టేషన్ ఆపరేటర్ తదితరులు పాల్గొన్నారు.

Printed Published and Owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao, RNI Title Code :- RNI TELTEL/2024/89620

## సర్ ప్రక్రియలో క్లెయిమ్‌లు, అభ్యంతరాలను సెప్టెంబర్ 16లోగా సమర్పించాలి

- **అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు**



**మంథని/పెద్దపల్లి, సెప్టెంబర్-01, నేటి శుభోదయ :** సర్ కార్యక్రమంలో భాగంగా ప్రచురించిన డ్రాఫ్ట్ ఓటరు జాబితాపై క్లెయిమ్‌లు, అభ్యంతరాలను సెప్టెంబర్ 16 వరకు సమర్పించవచ్చని అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు తెలిపారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సర్ కార్యక్రమంపై అవగాహన సమావేశం నిర్వహించారు. సర్ ప్రక్రియలో చేపడుతున్న చర్యలు, డ్రాఫ్ట్ ఓటరు జాబితా, క్లెయిమ్‌లు, అభ్యంతరాలు, నోటీసులు, విచారణ తదితర అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు మాట్లాడుతూ... డ్రాఫ్ట్ ఓటరు జాబితాపై వచ్చే క్లెయిమ్‌లు, అభ్యంతరాలన్నింటినీ నిబంధనల ప్రకారం పరిశీలించి పరిష్కరిస్తామని తెలిపారు. అర్హత కలిగిన ఏ ఓటరు పేరు కూడా జాబితాలో లేకుండా ఉండకూడదనే ఉద్దేశంతో సవరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.నో మ్యాపింగ్, అనామలీస్‌గా గుర్తించిన ఓటర్లకు నిబంధనల ప్రకారం నోటీసులు జారీ చేసినట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు మొత్తం 1,49,194 నోటీసులు జనరేట్ చేయగా, అందులో 58,313 నోటీసులను సంబంధిత ఓటర్లకు అందజేసినట్లు వెల్లడించారు. నోటీసు జారీ చేసిన తేదీ నుంచి ఏడు రోజుల అనంతరం సంబంధిత ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఆధ్వర్యంలో విచారణ నిర్వహిస్తామని చెప్పారు. నోటీసులు అందుకున్న ఓటర్లు నిర్దేశిత గడువులోగా విచారణకు హాజరై తమ ఓటు హక్కుకు సంబంధించిన ఆధారాలను సమర్పించాలని సూచించారు.ఓటు హక్కును క్లెయిమ్ చేసుకునే సమయంలో భారత ఎన్నికల సంఘం ఆమోదించిన 11 రకాల పత్రాల్లో ఒకదాన్ని ఆధారంగా సమర్పించాల్సి ఉంటుందని అదనపు కలెక్టర్ తెలిపారు. ఓటరు పుట్టిన తేదీకి సంబంధించిన నిబంధనల ప్రకారం అవసరమైన సందర్భాల్లో తల్లిదండ్రులకు సంబంధించిన రికార్డులు, ఆధార పత్రాలను సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో పేరు ఉన్న ప్రతి ఓటరు తన పేరు, వయస్సు, చిరునామా, ఇతర వివరాలను పరిశీలించుకోవాలని, వివరాల్లో ఏవైనా తప్పులు ఉన్నా, పేరు జాబితాలో లేకపోయినా, అర్హత లేని పేరు ఉన్నట్లు గుర్తించినా నిర్దేశిత విధానంలో క్లెయిమ్, అభ్యంతరాన్ని సమర్పించాలని తెలిపారు.సర్ ప్రక్రియలో భాగంగా బూత్ స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో ఓటర్లకు అవసరమైన సమాచారాన్ని అందించాలని, నోటీసులు అందుకున్న ఓటర్లకు విచారణకు హాజరయ్యే విధానం, సమర్పించాల్సిన పత్రాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ ప్రక్రియలో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా తమ పరిధిలోని ఓటర్లకు సర్ ప్రక్రియపై అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ కోరారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితాను పరిశీలించి, అర్హత కలిగిన ఓటర్ల పేర్లు నమోదు అయ్యేలా, అవసరమైన సవరణలు జరిగేలా తమ సూచనలు, అభ్యంతరాలను నిబంధనల ప్రకారం సమర్పించాలని ,క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ అనంతరం వాటిని సంబంధిత అధికారులు పరిశీలించి, అవసరమైన చోట విచారణ నిర్వహించి నిబంధనల ప్రకారం పరిష్కరిస్తారని అదనపు కలెక్టర్ తెలిపారు.ఓటర్లు సర్ ప్రక్రియను సద్వినియోగం చేసుకొని తమ ఓటు హక్కుకు సంబంధించిన వివరాలను సరిచూసుకోవాలని, అవసరమైన క్లెయిమ్‌లు, అభ్యంతరాలను సెప్టెంబర్ 16లోగా సమర్పించాలని,ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, అర్హత కలిగిన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా అధికారులు, రాజకీయ పార్టీలు, ప్రజలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.ఈ సమావేశంలో ఎన్నికల విభాగం అధికారులు విజయ్, ఐటి టెక్నికల్ కిరణ్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే లక్ష్యం.. రూ.31.80 లక్షల రుణాలు

- **రైతులకు కర్షక మిత్ర రుణ చెక్కులు అందజేసిన సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్**



**మంథని, సెప్టెంబర్-01, నేటి శుభోదయ :** రైతుల వ్యవసాయ అవసరాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా రూ.31.80 లక్షల కర్షక మిత్ర రుణాలు మంజూరు చేసినట్లు మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం సంఘ కార్యాలయంలో రుణ లబ్ధిదారులకు కార్యదర్శి బొద్దుల సమ్మయ్యతో కలిసి రుణ చెక్కులను అందజేశారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. రైతులకు అవసరమైన ఆర్థిక సహకారం అందించడమే సహకార సంఘం ప్రధాన లక్ష్యమన్నారు. మంజూరైన రుణాలను సద్వినియోగం చేసుకుని వ్యవసాయ రంగంలో మరింత అభివృద్ధి సాధించాలని సూచించారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని భవిష్యత్‌లో మరిన్ని రుణ సదుపాయాలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. రుణాల్లో భాగంగా పర్షవేన సంతోష్‌కు రూ.7.80 లక్షలు, మీసాల రవి, పర్షవేన బాలరాజు, నాగుల జగన్, అనవేన రాజేశ్వరికి రూ.6 లక్షల చొప్పున రుణాలు మంజూరయ్యాయి. ఈ కార్యక్రమంలో సహకార సంఘం పాలకవర్గ సభ్యులు, సిబ్బంది, రైతులు, రుణ లబ్ధిదారులు పాల్గొన్నారు.

## పేదల పక్షాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం-ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు

### - కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మంకాల శేఖర్ రెడ్డి.



**ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ 1, నేటి శుభోదయ :** ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని ఎలిమినేడు గ్రామములో ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మంకాల శేఖర్ రెడ్డి మాట్లాడుతూ,ఎలిమినేడు గ్రామంలో కొత్తగా వచ్చిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంగళ వారం ముగ్గు పోయడం జరిగింది.ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ మాకు కాంగ్రెస్ ప్రభుత్వం హయంలో ఇల్లు ఇస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది అన్నారు.ఇందిరమ్మ ఇల్లు ఇచ్చినందుకు సీఎం రేవంత్ రెడ్డికి స్తానిక ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మంకాలశేఖర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ మంద యాదమ్మ, పార్టీ సభ్యులు మేడ్చల్ రాంరెడ్డి, దోమకొండ నరసింహ కల్పన,మంచిరెడ్డి వెంకటరెడ్డి, గట్టు జంగయ్య, గ్రామ శాఖ అధ్యక్షుడు పిట్టల యాదగిరి, పొగాకు స్వామి, పట్నం బీరప్ప, మహేందర్, సతీష్, కార్యదర్శి రవి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారికి ఇరువైపులా మొక్కలు నాటేందుకు శ్రీకారం



**మంథని , సెప్టెంబర్ 01, నేటి శుభోదయ :** నాగ్‌పూర్–వరంగల్ జాతీయ రహదారి (ఎన్ హెచ్–44) పరిధిలోని కన్నాల, పందులపల్లి శివారు ప్రాంతాల్లో రహదారికి ఇరువైపులా మొక్కలు పెంచేందుకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా గ్రామపంచాయతీ పరిధిలోని నర్సరీ (మొక్కల పెంపక కేంద్రం) నుంచి మొక్కలను గ్రామపంచాయతీకి అందజేశారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గుడిసె గట్టయ్య యాదవ్ మొక్కలను అందజేశారు. జాతీయ రహదారి వెంట పచ్చదనం పెంపొందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని ఆయన తెలిపారు. మొక్కలను సంరక్షించి వాటి ఎదుగుదలకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ రమేష్, వనసేవక్ స్వప్న, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. రహదారి వెంట విస్తృతంగా మొక్కలు నాటి వాటిని సంరక్షించేందుకు గ్రామస్థులు సహకరించాలని వారు కోరారు.

## డీసీసీ కార్యదర్శిగా దుంపటి నగేష్‌కు అవకాశం

- **మహేష్‌కుమార్ గౌడ్, సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన నగేష్**



**ఖమ్మం, సెప్టెంబర్ 1, నేటి శుభోదయ :** పాపటపల్లి మాజీ సర్పంచ్ దుంపటి నగేష్‌కు డీసీసీ కార్యదర్శిగా అవకాశం కల్పించిన సందర్భంగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణను నగేష్ మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి పార్టీ జిల్లా స్థాయిలో బాధ్యతలు అప్పగించిన టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్‌కు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ సందర్భంగా దుంపటి నగేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. పార్టీ అధిష్ఠానం అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వహిస్తూ, గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమన్వయంతో పనిచేస్తానని పేర్కొన్నారు.డీసీసీ కార్యదర్శిగా తనకు అవకాశం కల్పించిన టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణలకు నగేష్ మరోసారి కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పార్టీ కోసం అంకిత భావంతో పనిచేస్తానన్నారు.నగేష్‌కు డీసీసీ కార్యదర్శి పదవి లభించడంపై పాపటపల్లి, రఘునాథపాలెం మండల కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలిండియా బంజారా సేన అధ్యక్షురాలు తారా దేవి, రఘునాథపాలెం మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బండి రమ, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు దుంపటి లక్ష్మణ్, కరాటే వేణు, దుంపటి సందీప్, వెంకట్, కార్తీక్, శ్రావణ్, చైతన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంలో రేవంత్ రెడ్డి సర్కార్ ఫెయిల్:శంషాబాద్ బిఆర్ఎస్వి జనరల్ సెక్రెటరీ రాఘవ రాజ్.



**రాజేంద్ర నగర్,ఆగస్టు 01, నేటి శుభోదయ :** ఆరు గ్యారెంటీలు–420 ఎన్నికల హామీల వైఫల్యం,మహాలక్ష్మి పథకం,మహిళలకు నెలకు 2,500 ఆర్థిక సాయం అందించే హామీ పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోలేదు శంషాబాద్ బిఆర్ఎస్వి జనరల్ సెక్రెటరీ రాఘవ రాజ్ ఆరోపించారు.కల్యాణ లక్ష్మి ,షాదీ ముబారక్:ఈ పథకాల కింద తులం బంగారం ఇస్తామన్న హామీని నెరవేర్చడంలో వైఫల్యం చెందారని ఆయన తెలిపారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన బిల్లుల మంజూరులో తీవ్రమైన కొర్రీలు పెడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయని ఆయన సూచించారు.రైతాంగ సమస్యలు,రైతు భరోసా నిలిపివేత,పెట్టుబడి సాయాన్ని పెంచుతామని చెప్పి,పాత పద్ధతిలో ఇచ్చే రైతుబంధును కూడా సక్రమంగా అందించడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని ఆయన హేదేవ చేశారు.

## గణేష్ నగర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉచిత అల్పాహార పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్.




**రాజేంద్రనగర్, , నేటి శుభోదయ :** రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని గణేష్ నగర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత అల్పాహార పథకాన్ని స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ లాంఛనంగా ప్రారంభించారు.పాఠశాలకు వచ్చిన విద్యార్థులకు ఎమ్మెల్యే స్వయంగా అల్పాహారాన్ని వడ్డించి,వారితో కాసేపు ముచ్చటించారు.అనంతరం విద్యార్థులతో కలసి ఆయన కూడా అల్పాహారం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..పేద విద్యార్థులు ఉదయాన్నే ఆకలితో పాఠశాలకు రాకూడదని,వారంతా ఆరోగ్యకరమైన పోషకాహారంతో ఉత్సాహంగా చదువుకోవాలనే ఉన్నత లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు.విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని చదువుల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు,విద్యాశాఖ అధికారులు,పాఠశాల ఉపాధ్యాయులు,నాయకులు,విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## అనాథ యువతి పూజా వివాహానికి కాంగ్రెస్ పార్టీ నాయకుల విరాళం

- రూ "25,348/-విరాళం అందజేత...



**తలకొండపల్లి, సెప్టెంబర్ 01, నేటి శుభోదయ :**
తలకొండపల్లి మండలం చుక్కాపూర్ గ్రామానికి చెందిన అనాథ యువతి లక్నమోని పూజా (ముదిరాజ్) వివాహానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు మానవతా దృక్పథంతో ఆర్థిక సహాయం అందించారు.సెప్టెంబర్ 4న తలకొండపల్లి మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో పూజా వివాహం జరగనుంది.ఈ సందర్భంగా తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాసు శ్రీనివాస్ రెడ్డి రూ.10,116, మాజీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డోకూరు ప్రభాకర్ రెడ్డి రూ.10,116, ఆమనగల్ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు యాట నరసింహ (ముదిరాజ్) రూ.5,116 విరాళంగా అందించారు. మొత్తం రూ.25,348 ఆర్థిక సహాయం అందించారు.పూజా 12 సంవత్సరాల క్రితం తల్లిదండ్రులను కోల్పోయిన నేపథ్యంలో, ఆమె కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న నాయకులు వివాహ ఖర్చులకు తమవంతు సహాయం అందించారు.అనాథ యువతి వివాహానికి అండగా నిలిచిన కాంగ్రెస్ నాయకులను స్థానిక ప్రజలు అభినందించారు.విరాళాలు అందించిన నాయకులకు పూజా కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు మాకం.అంజయ్య,శ్రీనివాసులు,కాడిగే.చంద్రకుమార్, కాంగ్రెస్ నాయకులు, వార్డు సభ్యులు, మీడియా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

## పాత పెన్షన్ విధానాన్ని పునరుద్దరించవల్సిందే
### - జేఏసీ చైర్మన్ ఉటు యశ్వంత్, కన్వీనర్ డా. రామారావు




**ఇబ్రహింపట్నం సెప్టెంబర్ 1,నేటి శుభోదయ :**
తెలంగాణ ఉద్యోగుల సంయుక్త కార్యాచరణ సమితి,రంగారెడ్డి జిల్లా తరపున, 01/09/2026 మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ఐ డి ఓ సి , కొంగరకలాన్‌లో నిరసన ప్రదర్శన నిర్వహించడము జరిగింది.ఈ నిరసన కార్యక్రమంలోఉద్యోగులు,ఉపాధ్యాయులు మరియు పెన్షనర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని నినాదాలతో ఐ డి ఓ సి కొంగరకలాన్ లో సి.పి.ఎస్ ను రద్దు చేసి ఓపిఎస్ ను పునరుద్దరించాలని ఉద్యోగ నాయకులు మాట్లాడారు. ఈ సందర్భంగా టి జి ఈ జె ఏ సి రంగారెడ్డి జిల్లా చైర్మన్ యశ్వంత్ మాట్లాడుతూ, సిపిఎస్ అనేది ఉద్యోగస్తుల పట్ల శాపంగా మారిందని సిపిఎస్ ను వెంటనే రద్దుచేయాలని. రాష్ట్ర ఉద్యోగ జేఏసీ కార్యాచరణలో భాగంగా 10న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని రంగారెడ్డి జిల్లా ఉద్యోగస్తులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు పెద్ద ఎత్తున పాల్గొని చలో హైదరాబాద్ ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ నిరసన కార్యక్రమం లో రంగారెడ్డి జిల్లా టీజీ ఈ జె ఎ సి కన్వీనర్ డాక్టర్ రామారావు మాట్లాడుతూ, సిపిఎస్అనేది చాలా ప్రమాధకరమైనదని ఇప్పుడున్న ప్రభుత్వం అధికారము లోకి వచ్చిన 6 మాసాలలో సిపిఎస్ రద్దు చేస్తామని చెప్పి ఇప్పుడు దాటవేసే ధోరణి కరెక్ట్ కాదని వెంటనే ఓపీఎస్ ను పునరుద్దరణ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ఉద్యోగులు,గెజిటెడ్,అధికారులు,ఉపాధ్యాయులు, నాలుగవ తరగతి ఉద్యోగులు, కార్మికులు పెన్షనర్లు అందరూ ఐక్యంగా ముందుకు వచ్చి, తమ సంపూర్ణ మద్దతును తెలియజేసారు. ఓపిఎస్ పునరుద్ధరణ కోసం మనమంతా ఐక్యంగా నిలబడి, మన గొంతును బలంగా వినిపిద్దాం అందరు కోరారు.ఈ కార్యక్రమం లో జిల్లా కో కన్వీనర్ శ్రీనేష్ కుమార్ నోరి,కో చైర్మన్లు గోపాల్, ప్రవీణ్,శాంతి శ్రీ, సుధాకర్,రాజేష్,బల్వంత్ రెడ్డి,వైస్ చైర్మన్లు నూతనకంటి వెంకట్, సైదమ్మ, రాకేష్, సెక్రెటరీలు ,మాధవ్,ఆనంద్, మహేష్,ప్రమీల,వెంకటప్ప,పాండు రంగారెడ్డి, కల్పన, జగన్నాథ్ శర్మ,అరుణ,గౌస్,తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్య పరిష్కారమే లక్ష్యం

- గ్రామంలో మంచినీటి ఎద్దడి తగ్గించడానికి కృషి చేస్తున్నాం
- గ్రామ సర్పంచ్ బానోతు జ్యోతి కొండ
- తాగునీరు ప్రతి మనిషి ప్రాథమిక హక్కు నీటి కోసం ఏ కుటుంబం ఇబ్బందులు పడకూడదు : ఎర్నెస్ట్ పాల్
- బోనకల్లులో రెండు చేతిపంపులు ప్రారంభం



**బోనకల్లు, సెప్టెంబర్ 01, నేటి శుభోదయ :**
గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించడమే లక్ష్యంగా గ్రేస్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో బోనకల్లు గ్రామంలో రెండు చేతిపంపులను ఏర్పాటు చేసి ప్రారంభించారు. తాగునీటి అవసరాలను గుర్తించి ప్రజలకు నీటి సౌకర్యం కల్పించేందుకు సంస్థ చేపడుతున్న సేవా కార్యక్రమాలను గ్రామస్థులు అభినందించారు.ఈ సందర్భంగా సర్పంచ్ బానోతు జ్యోతి కొండ మాట్లాడుతూ గ్రామంలో మంచినీటి ఎద్దడి తగ్గించేందుకు కృషి చేస్తున్నామని, ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు అవసరమైన ప్రాంతాల్లో బోర్లు, చేతిపంపులు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్న గ్రామీణ ప్రజలకు సేవా సంస్థలు అండగా నిలవడం అభినందనీయమన్నారు.గ్రేస్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో గ్రామాల్లో తాగునీటి అవసరాలను గుర్తించి బోర్లు ఏర్పాటు చేయడంతో పాటు ప్రజలకు అవసరమైన నీటి సౌకర్యాన్ని అందించేందుకు కార్యక్రమాలు కొనసాగిస్తామని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ప్రజల ప్రాథమిక అవసరాల్లో ఒకటైన తాగునీటి సమస్య పరిష్కారానికి సేవా సంస్థలు ముందుకు రావడం సమాజానికి ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా గ్రేస్ సర్వీస్ సొసైటీ ప్రతినిధి ఎర్నెస్ట్ పాల్ మాట్లాడుతూ.. తాగునీరు ప్రతి మనిషి ప్రాథమిక హక్కు అని, నీటి కోసం ఏ కుటుంబం ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో తమ సంస్థ సేవా కార్యక్రమాలను బోనకల్ గ్రామపంచాయతీ సహకారంతో చేపడుతోందని తెలిపారు. గ్రామాల్లో తాగునీటి సమస్య ఉన్న ప్రాంతాలను గుర్తించి, అవసరమైన చోట బోర్లు ఏర్పాటు చేయడంతో పాటు ప్రజలకు నీటి సౌకర్యం కల్పించేందుకు తమ వంతు సహకారం అందిస్తామన్నారు. ప్రజల అవసరాలకు స్పందించి సేవ చేయడమే తమ సంస్థ ప్రధాన లక్ష్యమని, సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ బానోతు కొండ, గ్రేస్ సర్వీస్ సొసైటీ ప్రతినిధులు జాను, ఎస్. నరేష్, పాస్టర్ మోహన్, బోనకల్ సహకార సంఘం మాజీ అధ్యక్షులు గుండపనేని సుధాకర్ రావు, గ్రామ పెద్దలు గాలి దుర్గారావు, నందమూరి సత్యనారాయణ, యార్లగడ్డ రమేష్, గుగులోతు నాగేశ్వరరావు, గంగుల పుల్లయ్య, బానోత్ రాజు నాయక్, గుగులోతు స్వామి, బాధావతు గాంగు, బానోతు మురళి, బుక్య శ్రీను, బోడ యోగి శ్రీనివాస్, గోపి, గ్రామపంచాయతీ పాలకవర్గం యార్లగడ్డ కుమారి, మరిధు శేషు, అంతోటి శ్రీను, అంతోటి సునీత, షేక్ మేరా సాహెబ్, జరుపల లావణ్య, తాలూరి జ్యోతి, ఉప్పర శీను, షేక్ నౌషిన్, మరియు మహిళలు బానోతు వెంకమ్మ, బోడ బదిలీ, బానోతు లక్షి , గుగులోతు దూది, భుఖ్య ప్రణీత, మరియు గ్రామపంచాయతీ సిబ్బంది మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని చేతి పంపుల ఏర్పాటుతో తాగునీటి సమస్య కొంతమేర పరిష్కారం కానుందని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

## పెరిగిపోతున్న గ్యాంగ్ వార్ సంస్కృతి

**ఖమ్మం, సెప్టెంబర్ 1, నేటి శుభోదయ :**
భద్రాద్రి కొత్తగూడెం ఖమ్మం జిల్లాలలో గ్యాంగ్ వార్ సంస్కృతి విచ్చలవిడిగా మారుతుంది. ముఖ్యంగా సింగరేణి గనులున్న ప్రాంతంలో కొత్తగూడెం ఇల్లందు మణుగూరు సత్తుపల్లి వంటి ఏరియాలలో ఈ గ్యాంగ్ వాసంస్కృతి ఎక్కువవుతుంది ముఖ్యంగా సింగరేణి కాలరీస్ లో గనులలో పని చేసే ఉద్యోగుల ఉద్యోగుల కుమారులు కొందరు ఇటువంటి వారు గ్యాంగులుగా ఏర్పడి ఆదిపత్య పోరు ఎక్కువై ఒకరిపై ఒకరు దాడి చేసుకోవటమే కాకుండా హత్యలకు కూడా పాల్పడుతున్నారు. చిన్నచిన్న ఘర్షణలే చిలికి చిలికి గాలి వానగా మారి పరస్పరదాడులకు కోరుకుంటున్నారు. ఇటీవల మణుగూరులో గ్యాంగ్ వారిలో ఒక వ్యక్తిని దారుణంగా చంపిన సంఘటన ఉదాహరణ. రేపు మాప వివాహం జరుగనున్న తరుణంలో ఇటువంటి సంఘటనలు జరగటం దురదృష్టకరం. గ్యాంగ్ లుగా విచ్చలవిడిగా మద్యం సేవించి మద్యం షాపులపై దాడి చేసిన సంఘటనలు కూడా ఉన్నాయి. చిన్న చిన్న ఘర్షణలకే ఒక హోటల్లో ధ్వంసం చేసిన సంఘటనలు కొన్ని జిల్లాల్లో జరుగుతున్నాయి. మద్యం గంజాయి సేవించి రోడ్లపై పచార్లు చేస్తూ ఇతర వాహనదారులను ఢీకొని వారి పైనే దాడి చేస్తున్న సంఘటనలు కూడా ఉన్నాయి. కొన్ని ఏరియాలలో రాత్రి వేళలో గ్యాంగులుగా నిలబడి ఇబ్బందులకు గురి చేస్తున్న సంఘటనలు ఉన్నాయి. చదువు సంధ్యాలేని కొందరు చదువుకున్న విద్యావంతులను ఉద్యోగాలు చేసే వారిని వివాహం చేసుకొని వారిని హింసించి బాధలు కురిచేసి ఆత్మహత్యలు పాల్పడిన సంఘటన గతంలో భద్రాద్రి కొత్తగూడెంలో వెలుగులో చూసాము. ఈ గ్యాంగులకు ప్రత్యక్షంగా గాని పరోక్షంగా గాని అధికార పార్టీ అండదండలు తోపాటు, ఏ పార్టీ వారికి ఆయా పార్టీల లో రక్షణ కవచంగా ఉండడం వల్ల మితిమీరిపోతున్నారు. కొందరు పార్టీని అండదండలు చూసుకొని సెటిల్మెంట్ దండాలలో కూడా గ్యాంగులు తలదొచ్చటం తలనొప్పిగా మారింది. కళాశాలలో సైతం ఏమైనా ఘర్షణలు జరిగితే గ్యాంగ్ వచ్చి విద్యార్థులపై దాడి చేసిన సంఘటనలు కడప గడప చూస్తున్నాం. కాలేజీలో సైతం కొందరు గ్యాంగులుగా ఏర్పడి తన్నుకునే సంఘటనలు చూస్తూ ఉన్నాం కానీ అవి వెలుగులోకి రావడం లేదు. కొన్ని ప్రధాన గ్యాంగులు నిలబడి ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఈ సంస్కృతి పెరగకముందే మొగ్గలోనే తుంచాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది. కొత్తగూడెం. మణుగూరు ఇల్లందు సత్తుపల్లి వంటి గనులున్నచోట ఈ గ్యాంగుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది కావున అక్కడ అధికారులు అణిచివేయాల్సిన అవసరం ఎంతైనా ఇప్పటికే చాలావరకు కఠిన చర్యలు చేసుకునేందుకు సంసిద్ధమయ్యారు తీసుకుంటున్నారు.

## ప్రజల కోసమే మోడల్ మార్కెట్.. ఎక్సైజ్‌కు కేటాయింపు వద్దు




**నేరెడ్ మెట్ , సెప్టెంబర్ 1, నేటి శుభోదయ :**
కౌకూర్ మోడల్ మార్కెట్ భవనాన్ని ఎక్సైజ్ శాఖకు కేటాయించడాన్ని పునఃపరిశీలించి, ప్రజా అవసరాలకు వినియోగించాలని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, సామాజిక కార్యకర్త తూడిమెళ్ల మల్లికార్జున్ డిమాండ్ చేశారు. ఎక్సైజ్ శాఖకు కేటాయింపును వ్యతిరేకిస్తూ స్థానికులు చేపట్టిన నిరసన మంగళవారం ఆరో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా మల్లికార్జున్ ఆధ్వర్యంలో కౌకూర్ ప్రజలు కీసర సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.కౌకూర్ ప్రస్తుతం యాప్రాల్ డివిజన్–189, కీసర సర్కిల్ పరిధిలోకి వచ్చినందున స్థానికంగా ఎంఎంసీ వార్డు కార్యాలయం, పల్లె దవాఖాన ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. మున్సిపల్ సేవల కోసం ప్రజలు సుమారు 18 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోందని, ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, పేదలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, పింఛన్లు, పౌర ఫిర్యాదులు, పారిశుద్ధ్యం, రోడ్లు, డ్రైనేజీ తదితర సేవలు స్థానికంగానే అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.మోడల్ మార్కెట్‌ను ఎక్సైజ్ శాఖకు కేటాయించే బదులు వార్డు కార్యాలయం, పల్లె దవాఖాన, గ్రంథాలయం, వ్యాయామశాల, మహిళా సంఘాల కార్యాలయం వంటి ప్రజోపయోగ కేంద్రాలను ఏర్పాటు చేయాలని మల్లికార్జున్ సూచించారు. ఎక్సైజ్ కార్యాలయం ఏర్పాటైతే వాహనాల రాకపోకలు, పార్కింగ్ తదితర సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. ప్రజల సమస్య పరిష్కారమయ్యే వరకు ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసనలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సయ్యద్ అస్లాం, శివరాజ్, హబీబ్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్ల వెంట విచ్చలవిడిగా బడ్డీ కొట్లు

- కార్పొరేషన్ ఆదాయానికి గండి
- ప్రైవేట్ వ్యక్తుల జేబుల్లోకి వేల రూపాయలు?
- పట్టించుకోని నగరపాలక అధికారులు



**ఖమ్మం, సెప్టెంబర్ 1, నేటి శుభోదయ :** ఎనగరంలో ప్రధాన రహదారులు, ఫుట్‌పాత్‌లు, కూడళ్ల పరిసరాల్లో బడ్డీ కొట్లు, తాత్కాలిక చిరు వ్యాపారాలు విచ్చలవిడిగా వెలుస్తున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజల రాకపోకలకు ఉపయోగపడాల్సిన ఫుట్‌పాత్‌లు, రోడ్డు మార్జిన్లు ఆక్రమణలకు గురవుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.నగర పరిధిలోని చెరువు బజార్ నుంచి మమత రోడ్డుకు వెళ్లే ప్రధాన రహదారి కబేలా వద్ద ప్రభుత్వ స్థలాన్ని వినియోగించుకుని ఓ బడ్డీ కొట్టు వ్యాపారి నుంచి నిబంధనల ప్రకారం రుసుములు వసూలు చేయాల్సి ఉంటుంది. అయితే కొన్నిచోట్ల అధికారిక రశీదులు లేకుండానే మస్జిదుకు సంబంధించిన ప్రైవేట్ వ్యక్తులు నెలవారీగా డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో కార్పొరేషన్‌కు చేరాల్సిన ఆదాయం పక్కదారి పడుతూ, వేల రూపాయలు ప్రైవేట్ వ్యక్తుల జేబుల్లోకి వెళ్తున్నాయన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.మరోవైపు బడ్డీ కొట్ల ఏర్పాటుతో పాదచారులకు ఇబ్బందులు, వాహనదారులకు ట్రాఫిక్ సమస్యలు, పారిశుధ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా రద్దీ ప్రాంతాల్లో రోడ్డు పక్కన అనుమతులు లేకుండా నిర్మించే తాత్కాలిక దుకాణాలు ప్రమాదాలకు కారణమయ్యే అవకాశం ఉంది.నగరపాలక సంస్థ పరిధిలో ఎన్ని బడ్డీ కొట్లకు అనుమతులు ఉన్నాయి? ఎన్ని కొట్ల నుంచి రుసుములు వసూలవుతున్నాయి? రోజువారీ, నెలవారీగా ఎంత ఆదాయం సమకూరుతోంది? అనధికారికంగా డబ్బులు వసూలు చేస్తున్న వ్యక్తులెవరు? అనే అంశాలపై సమగ్ర విచారణ జరపాల్సిన అవసరం ఉంది.కార్పొరేషన్ ఆదాయానికి గండి పడకుండా, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి అక్రమ బడ్డీ కొట్లను గుర్తించడంతో పాటు, వసూళ్ల వ్యవహారంపై పారదర్శకంగా దర్యాప్తు చేయాలని నగరవాసులు కోరుతున్నారు.

# వానాకాలం పంట వేసిన రైతులు -మీ వాలంటరీ ద్వారా నమోదు తీసుకోవాలి.

- యాచారం మండల వ్యవసాయఅధికారి రవినాథ్



**ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ 1, నేటి శుభోదయ :**
యాచారం రైతాంగానికి,రైతుల అందరూ ఈవాన కాలం 2026 లో మీరు వేసిన పంటల వివరాలను సర్వే నంబర్ ప్రకారం మీ రెవెన్యూ గ్రామ లోని సంబంధిత వాలంటీర్ మీ పొలంకి వచ్చి పంట నమోదు చేస్తారు. ఆ వాలంటీర్ కు అందరూ సహకరించగలరు.అలాగే ఇంకా ఏమైనా సందేహాలు ఉంటే మీ వ్యవసాయ విస్తరణ అధికారికి చెప్పగలరు.అలాగే రైతులు ఎవరైతే సన్న రకాలు వరి వేసిన వారు ఉంటే, ఎక్కడయితే సన్నవాడ్లు కొన్న డీలర్ దగ్గర రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి.ఎవరైతే ఇంటి దగ్గర ఉన్న సన్న రకాల వడ్లు వేశారో ఆ రైతు లు తమ ఏఈఓ దగ్గర రికార్డు 10.9.2026 వరకు చేసుకోగలరని విజ్ఞప్తి.మన మండల ఏఈఓ వివరాలు,ఎస్ సంతోష్ కుమార్, 6305920174, యాచారం క్లస్టర్ యాచారం, మొగుళ్లవంపు,నందివనపర్థి, మల్కీజూడ,అయ్యవరిగూడ, తక్కలపల్లీ, తక్కల్లపల్లి తండ, ఆ. గురు ప్రసాద్, 6305920176, గున్గల్ క్లస్టర్ గుంగల్, గడ్డమల్లయ్యగూడ, చౌదరిపల్లి, మొందిగౌరెల్లి , తులేకుర్దు,ఎం రమేష్,6305920175, మేడిపల్లి క్లస్టర్ మేడిపల్లి, నక్కర్త, కొత్తపల్లి, ననక్నగర్, తటిపర్తి, కుర్మిద్ద, P. నవ్య,6305920177, మాల్ క్లస్టర్ మాల్, నల్లవెల్లి, చింతపట్ల, మంతంగౌడ్, మంతంగౌరెల్లి తమ్మాలోనిగూడని సంప్రదించగలరు.

# వినాయక విగ్రహాల నిమజ్జనానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లను పరిశీలించిన పోలీస్ కమిషనర్



**ఖమ్మం, సెప్టెంబర్ 1 , నేటి శుభోదయ :**
ఖమ్మం నగరంలో వినాయక నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ప్రత్యేక దృష్టి సారించారు. మున్నేరు నదిలో ప్రస్తుతం నీటి లభ్యత తక్కువగా ఉన్న నేపథ్యంలో వినాయక విగ్రహాల నిమజ్జనానికి ప్రత్యామ్నాయంగా అనువైన చెరువులను మంగళవారం పరిశీలించారు.పోలీస్ కమిషనర్ సంబంధిత పోలీస్ అధికారులు, సంభాద్రి ఉత్సవ కమిటీ తో కలిసి నిమజ్జనానికి అనువైన చెరువులను సందర్శించి, అక్కడి పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అందులో భాగంగా ఖమ్మం అర్బన్ మండలంలోని దంసలాపురం గ్రామపంచాయతీ లోని కొత్తూరు చెరువు సందర్శించి పరిశీలించారు.గణేష్ విగ్రహాల నిమజ్జనం సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన భద్రతా, ట్రాఫిక్ నియంత్రణ ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు.నిమజ్జన ప్రాంతాల్లో విగ్రహాల తరలింపు, వాహనాల రాకపోకలు, పార్కింగ్, భక్తుల భద్రత తదితర అంశాలపై ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని ఈ సందర్భంగా సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా అన్ని శాఖల సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో విజయవంతంగా జరిగేలా పోలీస్ శాఖ అన్ని చర్యలు చేపడుతుందని పోలీస్ కమిషనర్ తెలిపారు.కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రామానుజం, టౌన్ ఏసీపీ రమణమూర్తి, ఎస్బి ఏసీపీ మహేష్, ఇన్స్పెక్టర్ మోహన్ బాబు, భానుప్రకాష్, సంభాద్రి ఉత్సవ కమిటీ వినోద్ లాహుటి, విద్యాసాగర్ శ్రీహరి, ప్రసన్నకృష్ణ,సుధాకర్, యుగేందర్ శర్మ, సురేష్ శర్మ పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 3వ తేదీన ఎన్ ఆర్ ఐ కోటాలో మిగిలిన యూజీ సీట్లకి వాక్ ఇన్ కౌన్సిలింగ్గతంలో దరఖాస్తు చేసుకోకపోయినా హాజరు కావొచ్చు

- అగ్రి వర్సిటీ ఉప కులపతి అల్దాస్ జానయ్య

**రాజేంద్రనగర్, సెప్టెంబర్01, నేటి శుభోదయ :** 2026–27 విద్యా సంవత్సరానికి ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలో కల కళాశాలల లో వివిధ అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులలో ఎన్ ఆర్ ఐ,ఎన్ ఆర్ ఐ ప్రాయోజిత కోటా లో మిగిలిన సీట్లలో ప్రవేశాలకి సెప్టెంబర్ 3వ తేదీ(గురువారం)న వాక్ ఇన్ కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు పిజె టిఏయు ఉప కులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య ప్రకటించారు.రాజేంద్రనగర్ లోని విశ్వవిద్యాలయం ఎగ్జామినేషన్స్ సెంటర్ లో ఉదయం పది గంటలకు ధృవపత్రాల పరిశీలన,కౌన్సిలింగ్ జరగనుందని అల్దాస్ జానయ్య వివరించారు.ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులతో పాటు అనివార్య కారణాల వల్ల దరఖాస్తు చేసుకొని వారు సైతం కౌన్సిలింగ్ కి హాజరు కావొచ్చని ఆయన స్పష్టం చేసారు.అభ్యర్థులు వారి తల్లి తండ్రులు విశ్వవిద్యాలయం వెబ్ సైట్ www.pjtau.edu.in ని సందర్శించి పూర్తి వివరాలు తెలుసుకొని అర్హత కల అభ్యర్థులు అవసరం అయిన పత్రాలు,ఫీజులతో కౌన్సిలింగ్ కి హాజరు కావాల్సిందిగా అల్దాస్ జానయ్య సూచించారు.



# స్వయం ఉపాధి అవకాశాల కోసం కృషి చేయాలి : కమీషనర్ సూచన



**ఖమ్మం, సెప్టెంబర్ 1, నేటి శుభోదయ :**
ట్రాన్స్‌జెండర్స్ సమాజంలో అందరితో సమానంగా గౌరవంగా జీవించేలాస్వయం ఉపాధి అవకాశాల కోసం ప్రయత్నాలు చేయాలని, అందుకు అవసరమైన సహకారం అందేలా ప్రయత్నం చేస్తామని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. మంగళవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ట్రాన్స్‌జెండర్స్ తో సమావేశం నిర్వహించారు. అయితే శుభకార్యాలు, వివాహాలు, ఇతర కార్యక్రమాలకు వెళ్లి ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం, బలవంతంగా డబ్బులు వసూలు చేయడం వంటి చర్యలకు పాల్పడవద్దని సూచించారు. ప్రజలకు అసౌకర్యం కలిగించే విధంగా వ్యవహరిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని అన్నారు. ట్రాన్స్‌జెండర్స్ పై ఉన్న వివక్షను తొలగించి సమాజంలో సొంతంగా బతికేలా జీవనోపాధి కోసం పోలీస్ అధికారులు ప్రయత్నం చేస్తామనడం ఒక సానుకూల పరిణామం అని పలువురు ట్రాన్స్‌జెండర్స్ హర్షం వ్యక్తం చేశారు.

# జోయి ఆసుపత్రిలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించిన ఇన్స్పెక్టర్ సీతయ్య.



**రాజేంద్రనగర్,సెప్టెంబర్01,నేటి శుభోదయ :** అత్తాపూర్‌లోని ఇన్‌స్పెక్టర్ ఎ.సిత్తయ్య,అలాగే సైబర్ వారియర్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ బి.రాజనాయక్ తమ పెట్రోల్ సిబ్బందితో కలిసి మంగళ వారం జోయి హాస్పిటల్‌లో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సైబర్ నేరాల అవగాహన కార్యక్రమంలో జోయి హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్,సిబ్బంది,కార్యనిర్వాహక సిబ్బంది,కార్మికులు,సందర్శకులు పాల్గొన్నారు.ఈ సైబర్ నేరాల అవగాహన కార్యక్రమంలో వారు ప్రస్తుతం జరుగుతున్న మోసాలు,బాస్ స్కామ్,అలాగే ఏపీకే ఫైల్ మోసాలు,ఓటీపీ మోసాలు,క్రెడిట్ కార్డ్ మోసాలు,వాట్సాప్ డిజిటల్ అరెస్టులు,మాల్వేర్,పెట్టుబడులు,పార్ట్ టైమ్ ఉద్యోగాల మోసాల గురించి వివరించారు.అలాగే ఇన్‌స్టాగ్రామ్ నకిలీ వెబ్‌సైట్లు,నకిలీ లింక్‌ల గురించి కూడా తెలియజేశారు.అదేవిధంగా,అత్తాపూర్ పోలీస్ అధికారులు జెర్మిన్‌టైన్ హాస్పిటల్‌లోని సిబ్బంది,మేనేజర్‌కు అవగాహన కల్పించడం జరిగిందన్నారు.

# అక్రమ టేకు కలప జప్తు.. కేసు నమోదు



**నిజామాబాద్ రూరల్ సిరికొండ, సెప్టెంబర్ 01, నేటి శుభోదయ :** అక్రమంగా నిల్వ ఉంచిన టేకు కలపను అటవీశాఖ అధికారులు దాడి చేసి జప్తు చేసుకున్నారు. సిరికొండ ఫారెస్ట్ రేంజ్ అధికారి (ఎఫ్ ఆర్ ఓ ) కె . నర్సింగరావు తెలిపిన వివరాల ప్రకారం... నిజామాబాద్ జిల్లా భీంగల్ మండలం ముచకూర్ గ్రామానికి చెందిన కొయ్యాడ చిన్న కిష్ట గౌడ్ అనే కలప వ్యాపారి వద్ద అక్రమ టేకు కలప ఉందనే విశ్వసనీయ సమాచారం అందింది.జిల్లా అటవీ శాఖ అధికారి, ఆర్మూర్ ఎఫ్‌డీఓ ఆదేశాల మేరకు సోమవారం సాయంత్రం సిరికొండ రేంజ్ సిబ్బందితో కలిసి ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో సుమారు ₹1,11,805/– విలువైన అక్రమ టేకు కలపతో పాటు, కలప కోసే మిషన్ (డుగోడ మిషన్) ను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.సిరికొండ రేంజ్ పరిధిలోని కార్పెంటర్లు, ఫర్నిచర్ దుకాణ యజమానులు తప్పనిసరిగా ప్రభుత్వ అనుమతి (పర్మిట్) ఉన్న టేకు సైజులను మాత్రమే వినియోగించాలని ఎఫ్ఆర్ఓ స్పష్టం చేశారు. పాత ఇండ్ల కలప పేరుతో అక్రమ టేకు దుంగలను తెచ్చి ఫర్నిచర్‌గా మార్చితే తెలంగాణ అటవీ చట్టం–1967 ప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# అరుణావర్ణమైన ఢిల్లీ

- **ఉమ్మడి ఖమ్మంజిల్లా నుంచి భారీగా తరలిన సిపిఐ శ్రేణులు**




**ఖమ్మం, సెప్టెంబర్ 1, నేటి శుభోదయ :** బస్తావ్ జరూరీ హై పేరుతో సిపిఐ మంగళవారం నిర్వహించిన బహిరంగ సభతో ఢిల్లీ అరుణ వర్ణాన్ని –సంతరించుకుంది. దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి పార్టీ కార్యకర్తలు తరలి రాగా ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో –సిపిఐ కార్యకర్తలు బహిరంగ సభకు హాజరయ్యారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల నుంచి హాజరైన కార్యకర్తలు ఢిల్లీలో వేరువేరుగా ప్రదర్శన నిర్వహించారు. ఖమ్మం జిల్లా ప్రదర్శనకు సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్రెడ్డి లు నేతృత్వం వహించగా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రదర్శనకు జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా నేతృత్వం వహించారు. రాంలీల మైదానం ఉదయం 10గంటలకే నిండిపోయింది. సభకు ఆశించిన దాని కంటే అధిక సంఖ్యలో ప్రజలు తరలి రావడం ముఖ్యంగా యువత, మహిళలు ఎక్కువగా తరలి రావడంతో సిపిఐ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నింపింది. ఈ సందర్భంగా బాగం హేమంతరావు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం పట్ల ప్రజల్లో ఉన్న వ్యతిరేకతకు ఈ బహిరంగ సభ అద్దంపట్టిందని ఆయన తెలిపారు. మోడీ ప్రభుత్వాన్ని మార్చడానికి సిపిఐ పూరించిన సమర శంఖారావం విజయవంతమైందని, రానున్న కాలంలో మరిన్ని ప్రజా ఉద్యమాలను నిర్మించనున్నట్లు హేమంతరావు తెలిపారు.

# జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి




**ఖమ్మం, సెప్టెంబర్ 1, నేటి శుభోదయ :** సెప్టెంబర్ 12న నిర్వహించ నున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయ వంతం చేసి, గరిష్ఠ సంఖ్యలో కేసుల పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌చార్జి చైర్మన్ డా. జి.వి. మహేష్ నాథ్ సూచించారు.జాతీయ లోక్ అదాలత్ నేపథ్యంలో ఖమ్మం యూనిట్ పరిధి లోని ఎస్‌హెచ్‌ఓలతో ఆయన సమావేశం నిర్వహించారు. రాజీకి అవకాశం ఉన్న కేసులను ముందుగానే గుర్తించి, సంబంధిత కక్షిదారులను లోక్ అదాలత్‌కు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీసు అధికారులు సమన్వయంతో పనిచేసి, వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీమతి పి. దేవి మనస, ఖమ్మం యూనిట్‌కు చెందిన ఎస్‌హెచ్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

# కేసు పల్లి లో విషాదం..

## - రోట వేటర్ లో పడి డ్రైవర్ మృతి



**ఏన్కూర్, సెప్టెంబర్01, నేటి శుభోదయ :** ఏన్కూర్ మండల పరిధిలోని కేసు పల్లి గ్రామంలో మంగళవారం విషాదం చోటుచేసుకుంది. వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్లిన వ్యాన్ డ్రైవర్ ప్రమాదవశాత్తు రోటవేటర్ లో పడి మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.... కేసు పల్లి గ్రామానికి చెందిన ఎనుముల గోపి (33) వ్యాన్, ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. వృత్తిరీత్యా ఇతర ప్రాంతాలకు వెళ్లి న గోపి రెండు రోజుల క్రితమే గ్రామానికి తిరిగి వచ్చాడు. మంగళవారం వ్యవసాయ పనుల నిమిత్తం రోట వేటర్ వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు రోటవేటర్ లో పడిపోయాడు దీంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న ఏన్కూర్ పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. గోపి మృతితో కేసు పల్లి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# కాంగ్రెస్ శ్రేణుల తీరుపై మండిపడుతున్న బిజెపి కార్యకర్తలు

- **బీజేపీ కార్యకర్తలకు గుడి లాంటి భారతీయ జనతా పార్టీ కార్యాలయం గేటుపై నలుపు రంగు.**
- **తీవ్రంగా ఖండించిన పద్మ అనిల్ ముదిరాజ్ బీజేవైఎం కల్వకుర్తి అసెంబ్లీ కన్వీనర్.**



**తలకొండపల్లి, సెప్టెంబర్ 1, నేటి శుభోదయ :** భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయంపై నిన్న కాంగ్రెస్ దుండగులు చేసిన అప్రజాస్వామిక దాడిని తీవ్రంగా ఖండిస్తున్న కల్వకుర్తి బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్, తలకొండపల్లిమాజీ ఉప సర్పంచ్ పద్మ అనిల్ ముదిరాజ్ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....బీజేపీ నాయకులకు,కార్యకర్తలకు, అభిమానులకు గుడి లాంటి కార్యాలయంపై ఇలాంటి చెర్య బాధాకరం,బిజెపిని ఎదుర్కోలేక పిరికిపందల్లా అల్లరి మూకలతో రాజకీయ పార్టీ కార్యాలయం పై దాడి చేసే విష సంస్కృతిని కాంగ్రెస్ పార్టీ పెంచి పోషిస్తున్నది.నిత్యం ప్రజా స్వామ్యం హక్కులు రాజ్యాంగం అంటూ నీతులు చెప్పే రాహుల్ గాంధీ గారు తెలంగాణ రాష్ట్రంలో అధికారం అడ్డుపెట్టుకొని కాంగ్రెస్ దుండగులు చేస్తున్న దాడిని ఖండించే నైతిక బాధ్యత లేదా ?.భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు ఎదురు దాడికి దిగితే తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ కార్యాలయాలు నలుపు రంగుతో మునిగి తెలుతాయి అనే విషయాన్ని కాంగ్రెస్ పార్టీ దుండగులు గుర్తుపెట్టుకుంటే మంచిది.బిజెపి కార్యాలయం గేట్లపై పూసిన నల్ల రంగు కాంగ్రెస్ పార్టీ ఎమర్జెన్సీ మనస్తత్వానికి నిదర్శనం. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని వారికి ఇఇచ్చిన హామీలను నెరవేర్చడానికి వినియోగించుకోలేక రోడ్లపై రెచ్చిపోతూ అధికారాన్ని దుర్వినియోగం చేస్తే బిజెపి చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు.

# పేదల పక్షాననే కాంగ్రెస్ ప్రభుత్వం-ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు

## - కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మంకాల శేఖర్ రెడ్డి.

**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 1, నేటి శుభోదయ :** ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని ఎలిమినేడు గ్రామములో ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మంకాల శేఖర్ రెడ్డి మాట్లాడుతూ,ఎలిమినేడు గ్రామంలో కొత్తగా వచ్చిన ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులకు మంగళ వారం ముగ్గు పోయడం జరిగింది.ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ మాకు కాంగ్రెస్ ప్రభుత్వం హాయంలో ఇల్లు ఇస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది అన్నారు.ఇందిరమ్మ ఇల్లు ఇచ్చినందుకు సీఎం రేవంత్ రెడ్డికి స్థానిక ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మంకాలశేఖర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ మంద యాదమ్మ, పార్టీ సభ్యులు మేడ్చల్ రాంరెడ్డి, దోమకొండ నరసింహ కల్పన,మంచిరెడ్డి వెంకటరెడ్డి, గట్టు జంగయ్య, గ్రామ శాఖ అధ్యక్షుడు పిట్టల యాదగిరి, పొగాకు స్వామి, పట్నం బీరప్ప, మహేందర్, సతీష్, కార్యదర్శి రవి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల పరిపాలన పై నిరసన తెలిపేందుకు ప్రతి ఒక్కరు విచ్చేయండి:మణికొండ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సీతారాం దూలపాల.



**రాజేంద్రనగర్,సెప్టెంబర్ 1, నేటి శుభోదయ :** భారత రాష్ట్ర సమితి తెలంగాణ రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారక రామారావు,పార్టీ రాజేంద్రనగర్ అసెంబ్లీ ఇన్‌చార్జి పట్లోల్ల కార్తిక్ రెడ్డి పిలుపు మేరకు 2 సెప్టెంబర్ 2026 మంగళవారం మొదలుకొని 8 సెప్టెంబర్ 2026 మంగళవారం వరకు తలపెట్టిన కార్యక్రమాల వివరాలు.సెప్టెంబర్ 2న శంషాబాద్ బస్‌స్టాండ్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహం కూడలి రోడ్ లో నిరసన కార్యక్రమం,నెరవేరని హామీల కార్డుల పంపిణీ,సాయంత్రం మర్రిచెట్టు వద్ద మణికొండ,నెక్నాంపూర్ మున్సిపల్ డివిజన్లలో పరిష్కారం కాని ప్రజా సమస్యలపై ఛార్జ్‌షీట్ విడుదల చేయడం జరుగుతుందని మణికొండ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సీతారాం దూలపాల తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సెప్టెంబర్ 3 న నీటి సరఫరా విషయమై డిప్యూటీ మేనేజర్ కార్యాలయం వద్ద,22ఎ విషయంమై లక్ష్మీనగర్ బీరప్ప ఆలయం క్రాస్ రోడ్ వద్ద నిరసన కార్యక్రమంలు.సెప్టెంబర్ 4న రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై పాషా కాలనీ,బాపు హిల్స్, శివాజీ నగర్,క్వార్టర్స్ వద్ద నిరసన కార్యక్రమంలు,సెప్టెంబర్ 5 న విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయమై అలకపూర్ గణేష్ చౌక్ వద్ద నిరసన కార్యక్రమం.సెప్టెంబర్ 6 న చిత్రపురి బస్తీ దవాఖానా సందర్శణ తదనంతరం బిఆర్ సి నుండి ఫ్రెండ్స్ కాలనీ వరకు మౌన ప్రదర్శన కార్యక్రమం.సెప్టెంబర్ 7న ప్రజావాణిలో పిర్యాదు.సెప్టెంబర్ 8 న నెక్నాంపూర్ అంబేద్కర్ విగ్రహం వినతిపత్రం సమర్పణ.పై అన్ని విషయాలు తెలుపుతూ పోలీసు కమిషనర్ కు సీతారాం ధూళిపాళ,కుంభగల్ల ధనరాజ్,గుట్టమీది నరేందర్,అందే లక్ష్మణ్ రావు,సుమనళిని,భాను చందర్,ఆశ్వక్ అలీ,శేఖర్ విడి విడిగా దరఖాస్తు ఇవ్వడం జరిగిందన్నారు.

# శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ ఆలయ బోనాలు, కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**రాజేంద్రనగర్, సెప్టెంబర్01 , నేటి శుభోదయ :** మహేశ్వరం మండలం పరిధిలోని రావిరాల గ్రామంలో కొలువై ఉన్న శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ దేవాస్థానంలో 43వ వార్షిక బోనాలు,కల్యాణ మహోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి.ఈ ఆధ్యాత్మిక వేడుకలకు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే కు ఆలయ ఫౌండర్,ట్రస్ట్ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం,దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు,కమిటీ సభ్యులు,గ్రామ పెద్దలు ఘన స్వాగతం పలికారు.అనంతరం ఎమ్మెల్యే అమ్మవారిని దర్శించుకుని,ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు అందుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సూర్యగిరి ఎల్లమ్మ తల్లి కరుణా కటాక్షాలతో ప్రజలందరూ సుఖసంతోషాలతో,ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు,దేవాదాయ శాఖ అధికారులు,గ్రామ ప్రజలు,భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.



## బీసీ ఎస్ సి ఎస్ టి -జె ఎ సి ఆధ్వర్యంలో కలెక్టర్ గారికి వినతి పత్రం



**నిజామాబాద్ రూరల్ ధర్పల్లి, సెప్టెంబర్ 1, నేటి శుభోదయ :** ధర్పల్లి మండల కేంద్రం తాసిల్దార్ కార్యాలయంలో బీసీ ఎస్ సి ఎస్ టి –జె ఏ సి మండల కమిటీ ఆధ్వర్యంలో సీనియర్ అసిస్టెంట్ సంపత్ గారికి వినతి పత్రం అందజేయడం జరిగింది ఈ సందర్భంగా నాయకులు బాలయ్య, మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సుమారు 30 లక్షల మంది విద్యార్థులకు సంబంధించిన దాదాపు 14 వేల కోట్ల ఫీజు రియంబర్స్మెంట్ ప్రభుత్వం వద్ద పెండింగ్లో ఉన్నది ఈ ఫీజులు చెల్లించలేని దుస్థితి కారణంగా ముఖ్యంగా బీసీ ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు కళాశాలలో తమ చదువులను కొనసాగించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు బకాయిలు ఆలస్యం కావడం వల్ల విద్యార్థుల చదువులకు తీవ్ర ఆటంకం కలిగి మధ్యలోనే ఆగిపోతున్నాయి కొందరు విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు మొత్తంగా ఈ ప్రభావం ఒక కోటి కుటుంబాలపై పడింది ఇంతటి దుర్భర పరిస్థితిని బీసీ ఎస్సీ ఎస్టీ పేద విద్యార్థులు ఎదుర్కొంటున్నారు.. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఫీజు రియంబర్స్మెంట్ వెంటనే రిలీజ్ చేయాలని డిమాండ్ చేసారు ఈ కార్యక్రమం లో ప్రశాంత్, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు

## నేపాల్ వరద ప్రళయానికి కొట్టుకుపోయిన రాళ్ల గూడెం ధనపాల్ రెడ్డి కుటుంబ సభ్యులను ఓదార్చిన కొండకల నరేందర్ రెడ్డి.



**రాజేంద్రనగర్,సెప్టెంబర్ 01, నేటి శుభోదయ :** మానస సరోవర యాత్రలో భాగంగా నేపాల్ వచ్చిన వరద ప్రళయానికి కనిపించకుండా పోయిన రాళ్ల గూడెం ధనపాల్ రెడ్డి కుటుంబ సభ్యులను వెళ్లి ఓదార్చడం జరిగిందని మణికొండ మున్సిపాలిటీ వై చైర్మన్ కొండకల నరేందర్ రెడ్డి తెలిపారు.అతను తప్పకుండా తిరిగి వస్తాడని నమ్మకాన్ని వ్యక్తం చేయడం జరిగిందన్నారు.కార్యక్రమంలో మణికొండ మాజీ వైస్ చైర్మన్ కొండకల్ల నరేందర్ రెడ్డి,భారతీయ జనతా పార్టీ డివిజన్ అధ్యక్షులు బాల్ రెడ్డి రవి కాంత్ రెడ్డి,వినోద్,శివ,రాజేష్ రఘు,సతీష్,తదితరులు పాల్గొన్నారు.

## పెద్దమరూర్ గ్రామంలో ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఏర్పాటు



**చిన్నంబావి , సెప్టెంబర్ 1 , నేటి శుభోదయ :** చిన్నంబావి మండలం, వనపర్తి జిల్లా పెద్దమరూర్ గ్రామంలో ఈరోజు ఎమ్మార్పీఎస్ నూతన గ్రామ కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది.ఈ కార్యక్రమం మండల అధ్యక్షులు కేతపాగ గోపాల్ మరియు ప్రధాన కార్యదర్శి కేతపాగ శివకృష్ణ గారి సమక్షంలో ఏర్పాటు జరిగింది. గ్రామంలోని ముఖ్య నాయకులు, యువకులు మరియు కార్యకర్తల సమక్షంలో గ్రామ నూతన ఎంఆర్పిఎస్ ఎంఆర్పిఎస్ కమిటీని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మంద కృష్ణ మాదిగ గారి నాయకత్వంలో కొనసాగుతున్న ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. సామాజిక న్యాయం, హక్కుల సాధన మరియు అణగారిన వర్గాల అభివృద్ధి కోసం ప్రతి కార్యకర్త ఐక్యంగా కృషి చేయాలని కోరారు.పెద్దమరూర్ గ్రామ నూతన కమిటీ వివరాలు కార్యక్రమంలో పెద్దమరూర్ గ్రామ ఎమ్మార్పీఎస్ నూతన కమిటీని ఏర్పాటు చేసి, క్రింది నాయకులకు వివిధ బాధ్యతలు అప్పగించడం జరిగిందిఅధ్యక్షులు మొలకలపల్లి శివ మాదిగఅధికార ప్రతినిధి సులిగిరి చిరంజీవి మాదిగఉపాధ్యక్షులు పగిడాల రాముడు మాదిగప్రధాన కార్యదర్శి దేవరపాగ నరేష్ మాదిగకోశాధికారి కేతపాగ రవి మాదిగకార్యదర్శి కేతపాగ కిరణ్ మాదిగసహాయ కార్యదర్శి1కేతపాగ కాశీం మాదిగసహాయ కార్యదర్శి2 కేతపాగ స్వాముల్లయ్య మాదిగసహాయ కార్యదర్శి3 పగిడాల చిన్న కురుమయ్య మాదిగనూతనంగా ఏర్పడిన గ్రామ కమిటీ ఎమ్మార్పీఎస్ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ, గ్రామంలో ఉద్యమాన్ని మరింత బలోపేతం చేసి ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని ఈ సందర్భంగా నాయకులు సూచించారు.మండల ముఖ్య నాయకులుఈ కార్యక్రమంలోకేతపాగ గోపాల్ ఎమ్మార్పీఎస్ చిన్నంబావి మండల అధ్యక్షులు మరియు మండల ప్రధాన కార్యదర్శి కేతపాగ శివకృష్ణ ,ఎం. స్వాముల్లయ్య మాదిగ కోశాధికారి వంగూర్ కోటేష్ మాదిగ కార్యదర్శితదితర మండల ముఖ్య నాయకులు పాల్గొని నూతన గ్రామ కమిటీ ఏర్పాటు కార్యక్రమాన్ని విజయవంతం చేశారుకార్యకర్తలుకేతపాగ మహేష్, ఎం. మహేష్, కె. గోపాల్, పి. కురుమయ్య, కె. నవీన్, పి. బాలకృష్ణ, ఎం. కురుమయ్య, ఎం. రాముడు, క్యాషియర్ నరసింహా, కె. స్వాముల్లయ్య తదితర కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు నాయకులు అభినందనలు తెలియజేస్తూ, పెద్దమరూర్ గ్రామంలో ఎమ్మార్పీఎస్ఉద్యమాన్ని మరింత బలోపేతం చేసి, మంద కృష్ణ మాదిగ గారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు నూతనంగా ఏర్పడిన పెద్దమరూర్ గ్రామ ఎమ్మార్పీఎస్ కమిటీ సభ్యులందరికీ హృదయపూర్వక అభినందనలు మరియు శుభాకాంక్షలుజై ఎమ్మార్పీఎస్ జై జై మంద కృష్ణ మాదిగసామాజిక న్యాయమే మా ఆశయం★హక్కుల సాధనే మా లక్ష్యం ఐక్య పోరాటమే మా బలం

## శాంతి నిలయంలో ఘనంగా గడ్డం భరత్ కుమార్ జన్మదిన వేడుకలు

- **జన్మదినం సందర్భంగా అన్నదానం.. సేవా కార్యక్రమాలు అభినందనీయం: సర్పంచ్ బానోతు జ్యోతి కొండ**



**బోనకల్, సెప్టెంబర్01, నేటి శుభోదయ :** 2026–27 విద్యా సంవత్సరానికి ప్రొఫెసర్ జయశంకర్ తెబోనకల్ మండల కేంద్రంలోని శాంతి నిలయంలో లక్ష్మీపురం గ్రామానికి చెందిన గడ్డం రమేష్–నాగమణి దంపతుల కుమారుడు గడ్డం భరత్ కుమార్ జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పలువురికి భోజనం అందించారు.ఈ కార్యక్రమానికి హాజరైన గ్రామ సర్పంచ్ బానోతు జ్యోతి కొండ మాట్లాడుతూ.. జన్మదినం వంటి శుభ సందర్భాలను కేవలం వేడుకలకే పరిమితం కాకుండా, సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలతో నిర్వహించడం అభినందనీయమన్నారు. పేదలు, అవసరమైన వారికి అన్నదానం చేయడం ద్వారా ఆత్మసంతృప్తి లభిస్తుందని పేర్కొన్నారు. భరత్ కుమార్ భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి సమాజ సేవలో ముందుండాలని ఆకాంక్షించారు.అనంతరం భరత్ కుమార్‌కు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బోనకల్ మండల మాజీ జెడ్పీటీసీ బానోతు కొండ, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు గుండపనేని సుధాకర్ రావు, వార్డు సభ్యులు జె. లావణ్య, జ్యోతి, షేక్ నౌషిన్, గ్రామస్థులు టైగర్, అంతోటి దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

## పరామర్శకు వెళ్తున్న బీజేపీ నాయకులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

- **డిండి పోలీసుల తీరుపై బీజేపీ నాయకుల ఆగ్రహం**



**డిండి(గుండ్లపల్లి), సెప్టెంబర్ 1, నేటి శుభోదయ :** బీజేపీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు వర్షిత్ రెడ్డిని పరామర్శించేందుకు వెళ్తున్న బీజేపీ డిండి మండల నాయకులను డిండి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దేవరకొండ నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ AT కృష్ణ, బీజేపీ డిండి మండల అధ్యక్షుడు సైదా, వార్డు నెంబర్ అమృత్, వావిల అంజి, సాయి గౌడ్, రాఘవేందర్, అంజి, సురేష్ తదితరులు వర్షిత్ రెడ్డిని పరామర్శించేందుకు వెళ్తుండగా పోలీసులు అడ్డుకుని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.జిల్లా అధ్యక్షుడిని పరామర్శించేందుకు వెళ్తున్న తమను పోలీసులు అడ్డుకోవడంపై బీజేపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య పద్ధతిలో పరామర్శకు వెళ్లే హక్కును అడ్డుకోవడం సరికాదని వారు పేర్కొన్నారు. పోలీసులు తమను అదుపులోకి తీసుకోవడానికి గల కారణాలను స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.

## బద్లావ్ జేరూరి హై మార్పు కావాలి

- **ఎరుపెక్కిన రామ్ లీలా మైదాన్**
- **ఢిల్లీ బయలుదేరిన తెలంగాణ సీపీఐ నేతలు**




**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 01, నేటి శుభోదయ :** దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం,విపరీతమైన ధరల పెరుగుదల,ప్రజాస్వామ్య హక్కుల హననం,కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు సిపిఐ చలో ఢిల్లీ కార్యక్రమం చేపట్టింది.సెప్టెంబర్ 1న న్యూఢిల్లీలోని చారిత్రాత్మక రాంలీలా మైదాన్‌లో తలపెట్టిన ప్రతిష్టాత్మక 'బద్లావ్ జరూరీ హై' "మార్పు కావాలి "సిపిఐ జాతీయ కార్యదర్శి కామ్రేడ్ పల్లా వెంకట్ రెడ్డి,ఎమ్మెల్సీ కామ్రేడ్ సత్యం,సిపిఐ రాజేంద్రనగర్ మండల కార్యదర్శి కన్యగారి నర్సింహ్మరెడ్డి,జిల్లా కౌన్సిల్ సభ్యులు జే ఆనంద్ గౌడ్,రాజేంద్రనగర్ మండల సహాయ కార్యదర్శి జె విజయ్ ఆనంద్ గౌడ్,మండల బిసి అధ్యక్షులు జే సదనంద్ గౌడ్ లు న్యూఢిల్లీ బయలుదేరి వెళ్లారు.దేశంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల,విద్వేషపూరిత విధానాల వల్ల కార్మికులు,కర్షకులు,యువత,నిరుద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను నిలదీస్తూ,దేశాన్ని సరైన ప్రజాస్వామ్య మార్గంలో నడిపించేందుకు ఈ "బద్లావ్ జరూరీ హై" సభ చారిత్రాత్మక మలుపు కానుందని తెలంగాణ రాష్ట్రం నుండి తరలి వెళ్లిన ప్రతినిధి బృందం ఢిల్లీ రాంలీలా మైదాన్‌లో జరిగే జాతీయ స్థాయి నిరసన ప్రదర్శనలో క్రియాశీలకంగా పాల్గొని,కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై గళం విప్పనుందన్నారు.

## సీపీఎస్ రద్దు చేసి.. ఓపీఎస్ పునరుద్ధరించాలి

- **నల్లబ్యాడ్జీలతో ప్రభుత్వ ఉద్యోగుల నిరసన**



**మంథని, సెప్టెంబర్-01,నేటి శుభోదయ :** TNGOs, TGEJSC పిలుపు మేరకు మంథనిలో ప్రభుత్వ ఉద్యోగులు మంగళవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. ఉద్యోగులకు అమలు చేస్తున్న కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (CPS)ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానం (OPS)ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఉద్యోగులు తమ డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో TNGOs మంథని డివిజన్ అధ్యక్షుడు నూకల శంకర్, తహసీల్దార్ కార్యాలయ డిప్యూటీ తహసీల్దార్ బి. కిరణ్‌కుమార్‌తో పాటు సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, రికార్డు అసిస్టెంట్లు, ఆఫీస్ సబార్డినేట్లు తదితర ఉద్యోగులు పాల్గొన్నారు.

# బీజేపీ పాలనకు చరమగీతం తప్పదు

## - జాదవ్ ధారాసింగ్ నాయక్

- వికారాబాద్‌లో కాంగ్రెస్ భారీ ర్యాలీ..
- కేంద్ర ప్రభుత్వ విధానాలపై తీవ్ర నిరసన




**వికారాబాద్, సెప్టెంబర్ 1, నేటి శుభోదయ :** వికారాబాద్: బీజేపీ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వంపై పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని డీసీసీ అధ్యక్షుడు జాదవ్ ధారాసింగ్ నాయక్ అన్నారు. మంగళవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా జాదవ్ ధారాసింగ్ నాయక్ మాట్లాడుతూ.. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై కక్షపూరితంగా ఎఫ్ఐఆర్ నమోదు చేయడం సరికాదన్నారు. దేశంలోని బడుగు, బలహీన వర్గాల ప్రజలపై కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతూ చిన్నచూపు చూస్తోందని ఆరోపించారు. ఉత్తరాఖండ్‌లోని హాల్ద్వానీలో జరిగిన ఘటనకు బాధ్యులైన బీజేపీ కార్యకర్తలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకోకపోతే కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దించే వరకు కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ శ్రేణులు ఐక్యంగా ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. భారీ ర్యాలీతో వికారాబాద్ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ శ్రేణులు తమ నిరసనను వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి, ఏఐసీసీ సభ్యుడు సంతోష్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేష్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం అనన్య, ఏఎంసీ చైర్మన్లు శ్రీనివాస్ ముదిరాజ్, వడ్డే శ్రీనివాస్, భాస్కర్ రెడ్డి, మహేందర్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ సుధాకర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ, సీనియర్ నాయకులు కిషన్ నాయక్, చిగుళ్లపల్లి రమేష్, మహిపాల్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సతీష్ రెడ్డి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సంతోష, మైనార్టీ సెల్ చైర్మన్ ఖాజా సలావుద్దీన్ హైమద్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు, మండల అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# బస్తీ దవాఖానా పరిసరాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యం

- వివేక్‌నగర్ దవాఖానాను పరిశీలించిన రాష్ట్ర ప్రోగ్రామ్ అధికారి డా. ప్రసాద్, డీఎంహెచ్ఓ డా. కె. ఆనంద్




**మేడ్చల్ కలెక్టరేట్ , సెప్టెంబర్ 1 , నేటి శుభోదయ :** వివేక్‌నగర్‌లోని బస్తీ దవాఖానాను రాష్ట్ర ప్రోగ్రామ్ అధికారి డా. ప్రసాద్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. కె. ఆనంద్ మంగళవారం సందర్శించి వైద్య సేవలను పరిశీలించారు. ఒకే ప్రాంగణంలో వార్డు కార్యాలయం, అంగన్‌వాడీ కేంద్రం, బస్తీ దవాఖానా కొనసాగుతున్న నేపథ్యంలో ప్రజలకు మరింత మెరుగైన ఆరోగ్య సేవలు అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు.దవాఖానా పరిసరాల పరిశుభ్రత, భద్రత, ప్రజలకు అనుకూలమైన వాతావరణం కల్పించడంపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించారు. ప్రాంగణంలో అనధికారిక వాహనాల పార్కింగ్, కార్యాలయ భవనం పరిసరాల్లో అనధికారిక సమావేశాలు నిర్వహించడం, కార్యాలయ సమయం అనంతరం ప్రాంగణాన్ని దుర్వినియోగం చేస్తున్నట్లు గుర్తించారు. ఖాళీ మద్యం సీసాలు, వినియోగించిన పేపర్ ప్లేట్లు, గ్లాసులు తదితర వ్యర్థాలు కనిపించడంతో తక్షణమే పారిశుధ్య చర్యలు చేపట్టాలని సూచించారు.అనంతరం స్థానికులతో మాట్లాడిన అధికారులు బస్తీ దవాఖానాలో అందుతున్న వైద్య సేవలు, పనితీరుపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. దవాఖానా సేవలపై ప్రధాన ఫిర్యాదులు లేకపోవడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రాంగణంలో వాహనాల పార్కింగ్ సమస్య పరిష్కారానికి ట్రాఫిక్ అధికారులతో సమన్వయం చేసుకోవాలని, తక్కువ ఎత్తులో ఉన్న సరిహద్దు గోడకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.అదేవిధంగా శానిటేషన్ ఇన్‌చార్జి తన బృందంతో ప్రాంగణాన్ని సందర్శించి పూర్తిస్థాయి పరిశుభ్రత చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలకు సురక్షితమైన, పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యమైన వైద్య సేవలు అందేలా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో చర్యలు కొనసాగిస్తారని డా. కె. ఆనంద్ తెలిపారు.

# కాంగ్రెస్ నాయకుల తీరుపై భగ్గుమన్న బిజెపి శ్రేణులు!

- బీజేపీ కార్యకర్తలకు గుడి లాంటి భారతీయ జనతా పార్టీ కార్యాలయం గేటుపై నలుపు రంగు.
- తీవ్రంగా ఖండించిన బిజెపి నాయకుడు తిరుమణి రాఘవేందర్ గౌడ్




**తలకొండపల్లి, సెప్టెంబర్ 1, నేటి శుభోదయ** భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయంపై నిన్న కాంగ్రెస్ దుండగులు చేసిన అప్రజాస్వామిక దాడిని తీవ్రంగా ఖండిస్తున్న తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామ బిజెపి నాయకుడు తిరుమణి రాఘవేందర్ గౌడ్ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ నాయకులకు,కార్యకర్తలకు, అభిమానులకు గుడి లాంటి కార్యాలయంపై ఇలాంటి చెర్య బాధాకరం,బిజెపిని ఎదుర్కోలేక పిరికిపందల్లా అల్లరి మూకలతో రాజకీయ పార్టీ కార్యాలయంపై దాడి చేసే విష సంస్కృతిని కాంగ్రెస్ పార్టీ పెంచి పోషిస్తున్నది.నిత్యం ప్రజాస్వామ్యం హక్కులు రాజ్యాంగం అంటూ నీతులు చెప్పే రాహుల్ గాంధీ గారు తెలంగాణ రాష్ట్రంలో అధికారం అడ్డుపెట్టుకొని కాంగ్రెస్ దుండగులు చేస్తున్న దాడిని ఖండించే నైతిక బాధ్యత లేదా ?.భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు ఎదురు దాడికి దిగితే తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ కార్యాలయాలు నలుపు రంగుతో మునిగి తెలుతాయి అనే విషయాన్ని కాంగ్రెస్ పార్టీ దుండగులు గుర్తుపెట్టుకుంటే మంచిది.బీజెపి కార్యాలయం గేట్లపై పూసిన నల్ల రంగు కాంగ్రెస్ పార్టీ ఎమర్జెన్సీ మనస్తత్వానికి నిదర్శనం. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని వారికి ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి వినియోగించుకోలేక రోడ్లపై రెచ్చిపోతూ అధికారాన్ని దుర్వినియోగం చేస్తే బిజెపి చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు.

# రెండో రోజు ఘనంగా ప్రారంభమైన దేవేంద్ర సామాజిక చైతన్య నాటకోత్సవాలు

**ఖమ్మం, సెప్టెంబర్ 1, నేటి శుభోదయ :** ఖమ్మం భక్త రామదాసు కళాక్షేత్రం నందు దేవేంద్ర సామాజిక చైతన్య నాటకోత్సవాలు మూడు రోజుల పాటు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమంలో భాగంగా మంగళవారం రెండవ రోజు కార్యక్రమంగా మహాత్మా జ్యోతిరావు పూలే జీవితాన్ని ఆవిష్కరించే సత్యశోధన నాటకం ప్రదర్శింపబడింది. రెండవ రోజు కార్యక్రమాన్ని మహాత్మ జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమం ప్రారంభ సూచికంగా ప్రముఖ సామాజికవేత్త ఎంఎస్ గోపీనాథ్, ప్రముఖ సాహితీవేత్త జీవన్ బయ్యన బాబు తదితరులు లాంచనంగా ప్రారంభించగా అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షులు సిద్దోజు, ప్రధాన కార్యదర్శి జగ్గరాజు ఈ నాటికల రచయిత కె దేవేంద్ర లు పాల్గొనగా కళాకారులు మహాత్మ జ్యోతిబాపూలే గీతాలను ఆలపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశ మహోన్నత మార్గదర్శి మహాత్మా జ్యోతిరావు పూలే అని ఆయనను అంబేద్కర్ తన గురువుగా ప్రకటించుకుంటారని ఆయన మార్గదర్శకత్వంలోనే ముందుకు సాగుతామని ఆయన జీవితమే ఈ దేశ ప్రజల కోసం అర్పితం చేసిన మహానుభావులని ఆయన జీవితాన్ని రూపకంగా నాటకంగా తీసుకొని ప్రజా చైతన్యం కోసం ప్రయాణం కట్టామని



ఇది 70వ ప్రదర్శనగా మన ఖమ్మంలో ప్రదర్శిస్తున్నామని వివరించారు.ఈ కార్యక్రమంలో వివిధ సామాజిక, సాంస్కృతిక సాహిత్య రాజకీయ ప్రముఖులు ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సోమవారం, మంగళవారం రోజు కార్యక్రమాలను తిలకించి జయప్రదం చేసిన విధంగానే బుధవారం జరగబోయే బుద్ధునితో నా ప్రయాణం నాటకానికి కూడా విచ్చేసి విజయవంతం చేయాలని ప్రేక్షకులందరికీ విజ్ఞప్తి చేశారు.

# కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో మంత్రి తుమ్మల భేటీ

- కొత్తగూడెం విమానాశ్రయ కలకు రెక్కలు
- సెప్టెంబరు 7న క్షేత్రస్థాయి పరిశీలనకు కేంద్ర సాంకేతిక బృందం
- నాలుగైదు ప్రత్యామ్నాయ స్థలాలపై లోతైన అధ్యయనం
- నివేదిక అనుకూలిస్తే తక్షణమే తదుపరి చర్యలు
- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు హామీ





**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1, నేటి శుభోదయ :** వైభద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజల దశాబ్దాల కల సాకారం దిశగా మరో కీలక ముందడుగు పడింది. జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటు కోసం అనువైన స్థలాన్ని గుర్తించే ప్రక్రియలో భాగంగా సెప్టెంబరు 7న కేంద్ర సాంకేతిక బృందం తెలంగాణలో పర్యటించనుంది. నాలుగు నుంచి ఐదు ప్రత్యామ్నాయ ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, రన్‌వే నిర్మాణానికి అనుకూలత, భౌగోళిక పరిస్థితులు, వాతావరణం, భూసేకరణ తదితర అంశాలపై సమగ్రంగా అధ్యయనం చేయనుంది.ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంగళవారం న్యూఢిల్లీలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును కలిసి కొత్తగూడెం విమానాశ్రయం ఏర్పాటుపై చర్చించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజల చిరకాల ఆకాంక్షను, విమానాశ్రయం ఏర్పాటుతో జిల్లాకు కలిగే రవాణా, పారిశ్రామిక, పర్యాటక ప్రయోజనాలను కేంద్ర మంత్రికి వివరించారు.

**- గత అడ్డంకులు, కొత్త ఆశలు**

గతంలో గుర్తించిన రెండు ప్రాంతాలు సాంకేతిక కారణాలతో అనుకూలంగా లేవని తేలడంతో, రాష్ట్ర ప్రభుత్వం అధికారులతో సమన్వయం చేసుకుంటూ కొత్తగా నాలుగైదు ప్రత్యామ్నాయ స్థలాలను గుర్తించినట్లు మంత్రి తుమ్మల తెలిపారు. ఈ ప్రాంతాల్లో భూసేకరణ సౌలభ్యం, రన్‌వే నిర్మాణానికి అనువైన భూభాగం, వాతావరణ పరిస్థితులు వంటి కీలక అంశాలను నిపుణుల బృందం నిశితంగా అధ్యయనం చేయనుంది.

**- ఢిల్లీ వేదికగా కీలక భేటీ**

ఈ పరిణామాలపై మంగళవారం న్యూఢిల్లీలో కీలక పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును ప్రత్యేకంగా కలిశారు. ఈ సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజల చిరకాల ఆకాంక్షను కేంద్ర మంత్రి దృష్టికి సవివరంగా తీసుకెళ్లారు. జిల్లా అభివృద్ధిలో విమానాశ్రయం పోషించే పాత్రను, స్థానికుల రవాణా అవసరాలను మంత్రి తుమ్మల వివరించగా, కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు. సాంకేతిక బృందం నివేదిక అనుకూలంగా వచ్చిన వెంటనే విమానాశ్రయం ఏర్పాటుకు తదుపరి చర్యలు చేపడతామని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు హామీ ఇచ్చినట్లు మంత్రి తుమ్మల వెల్లడించారు.

**- మైత్రి పునాదిగా విజ్ఞప్తి**

ఈ సందర్భంగా కేంద్ర మంత్రితో తనకున్న చిరకాల మైత్రిని కూడా మంత్రి తుమ్మల గుర్తుచేశారు. రామ్మోహన్ నాయుడు తండ్రి, దివంగత నేత ఎర్రన్నాయుడుతో తనకున్న అనుబంధాన్ని ప్రస్తావించారు. పుణ్యక్షేత్రం భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానం ఉన్న ఈ ప్రాంత ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రాధాన్యాన్ని, అలాగే జిల్లా ప్రజలకు విమానాశ్రయం వల్ల కలిగే ప్రయోజనాలను కేంద్ర మంత్రికి సవివరంగా వివరించారు. "భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజల దీర్ఘకాల ఆకాంక్షను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లాను. నా విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించి, వెంటనే కేంద్ర సాంకేతిక బృందాన్ని పంపేందుకు చర్యలు చేపట్టిన కేంద్ర మంత్రి శ్రీ రామ్మోహన్ నాయుడికి, కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు" అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

**--- మరో రెండు ప్రతిపాదనలపైనా కదలిక**

రాష్ట్రంలోని ఇతర విమానాశ్రయ ప్రతిపాదనలపైనా కేంద్రంతో చర్చలు కొనసాగుతున్నాయని మంత్రి తుమ్మల తెలిపారు. మామునూరు (వరంగల్), ఆదిలాబాద్ విమానాశ్రయాల అంశంపై సెప్టెంబరు 2న ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వంతో చర్చించనున్నట్లు ఆయన వెల్లడించారు. దీన్నిబట్టి రాష్ట్రవ్యాప్తంగా విమానయాన మౌలిక సదుపాయాల విస్తరణపై సర్కారు ప్రత్యేక దృష్టి సారించినట్లు స్పష్టమవుతోంది.కేంద్ర సాంకేతిక బృందం నివేదిక సానుకూలంగా వస్తే.. భద్రాద్రి కొత్తగూడెం గగనతలంలో విమానం రెక్కలు విప్పే రోజు ఎంతో దూరంలో లేదన్న ఆశాభావం జిల్లావాసుల్లో వ్యక్తమవుతోంది.

# ప్రశ్నిస్తే దాడులు.. అరెస్టులు

- అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు: బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు బాత్కు శ్రీనివాస్



**శంషాబాద్, సెప్టెంబర్ 1, నేటి శుభోదయ :**
ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే దాడులు, అరెస్టులతో గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారని బీజేవైఎం రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు బాత్కు శ్రీనివాస్ ఆరోపించారు. నాంపల్లిలోని భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయం వద్ద సోమవారం చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు బీజేపీ రాష్ట్ర కార్యాలయం వద్దకు వచ్చి ఆందోళనకు దిగడం, కార్యాలయ గేటుకు నల్లరంగు పూయడం వంటి ఘటనలు ప్రజాస్వామ్యానికి విరుద్ధమని శ్రీనివాస్ అన్నారు. ఈ ఘటనను బీజేపీ తరపున తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. కార్యాలయంపై ఆందోళన జరుగుతున్న సమయంలో పోలీసులు తగిన చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. ఈ ఘటనను నిరసిస్తూ చేపట్టిన కార్యక్రమంలో పాల్గొనకుండా శంషాబాద్ పోలీసులు తనను ముందస్తుగా హౌస్ అరెస్ట్ చేశారని ఆయన తెలిపారు. తనతో పాటు పలువురు యువమోర్చా కార్యకర్తలను కూడా పోలీసులు అరెస్టు చేశారని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వం, పోలీసు వ్యవస్థ ప్రతి ఒక్కరికీ సమానంగా వ్యవహరించాలని శ్రీనివాస్ డిమాండ్ చేశారు. అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు రాకుండా పోలీసులు నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని కోరారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించడం, నిరసన వ్యక్తం చేయడం ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడికి ఉన్న హక్కు అని పేర్కొన్న ఆయన.. అరెస్టులు, నిర్బంధాలతో బీజేపీ, యువమోర్చా కార్యకర్తల ఉద్యమాలను అడ్డుకోలేరని స్పష్టం చేశారు. శాంతియుత ప్రజాస్వామ్య పద్ధతుల్లో తమ పోరాటాన్ని కొనసాగిస్తామని బాత్కు శ్రీనివాస్ తెలిపారు.

# రాయన్నగూడ–కేబిదొడ్డి రోడ్డుకు మోక్షమెప్పుడో?

## - ఏళ్లుగా అధ్వానంగా రహదారి...





**శంషాబాద్, సెప్టెంబర్ 1 , నేటి శుభోదయ :**
శంషాబాద్ మండలంలోని రాయన్నగూడ–కేబిదొడ్డి రహదారి పరిస్థితి దారుణంగా తయారైంది. అడుగడుగునా గుంతలు, దెబ్బతిన్న రహదారితో వాహనదారులు నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు. వర్షం పడితే పరిస్థితి మరింత దారుణంగా మారి రహదారి మొత్తం బురదమయంగా మారుతోంది.వర్షపు నీరు గుంతల్లో చేరడంతో వాహనదారులకు గుంతల లోతు కనిపించని పరిస్థితి నెలకొంటోంది. దీంతో ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి కిందపడిన సందర్భాలు చాలా ఉన్నాయి. ఆటోలు, ట్రాక్టర్లు, ఇతర వాహనాలు సైతం ఈ మార్గంలో ప్రయాణించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. చిన్నపాటి ప్రయాణం సైతం గంటల తరబడి సాగుతున్న పరిస్థితి ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రైతుల రాకపోకలకు కీలక మార్గంరాయన్నగూడ, కేబిదొడ్డితో పాటు చుట్టుపక్కల గ్రామాల రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను శంషాబాద్ మార్కెట్‌కు తరలించేందుకు ప్రధానంగా ఈ రహదారినే వినియోగిస్తున్నారు. అయితే రహదారి దుస్థితి కారణంగా పంటలను మార్కెట్‌కు తీసుకెళ్లడం రైతులకు భారంగా మారింది. పంట రవాణాకు ఎక్కువ సమయం పడటంతో పాటు వాహనాల మరమ్మతులకు అదనపు ఖర్చులు వస్తున్నాయని రైతులు చెబుతున్నారు.వర్షాకాలంలో బురద, నీటి గుంతల కారణంగా ట్రాక్టర్లు, సరుకు రవాణా వాహనాలు ముందుకు కదలడం కూడా కష్టంగా మారుతోంది. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంటను సకాలంలో మార్కెట్‌కు తరలించలేక నష్టపోయే పరిస్థితి ఏర్పడుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రమాదాలకు నిలయంగా..రహదారిపై ఏర్పడిన భారీ గుంతలు ప్రమాదాలకు ఆహ్వానం పలుకుతున్నాయి. రాత్రి వేళల్లో పరిస్థితి మరింత ప్రమాదకరంగా ఉంటోందని వాహనదారులు చెబుతున్నారు. వర్షం కురిసిన సమయంలో గుంతలు నీటితో నిండిపోవడంతో వాహనదారులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు.ఇంతటి కీలకమైన రహదారి అధ్వానంగా మారినా సంబంధిత అధికారులు శాశ్వత పరిష్కారం చూపకపోవడంపై స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తాత్కాలికంగా గుంతలు పూడ్చడం కాకుండా నాణ్యతతో కూడిన శాశ్వత రహదారి నిర్మాణం చేపట్టాలని వారు కోరుతున్నారు.ఇకనైనా స్పందించాలిప్రజలు, రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం, సంబంధిత అధికారులు వెంటనే స్పందించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. రాయన్నగూడ–కేబిదొడ్డి రహదారి పనులను ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేసి ప్రజలకు సురక్షితమైన రాకపోకల సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.“రహదారి పరిస్థితి రోజురోజుకూ మరింత దారుణంగా మారుతోంది. వర్షం పడితే ఈ మార్గంలో ప్రయాణించడం ప్రాణాలతో చెలగాటంగా మారుతోంది. రైతులు తమ పంటలను మార్కెట్‌కు తరలించేందుకు పడుతున్న కష్టాలను ప్రభుత్వం గుర్తించి వెంటనే రహదారి పనులు పూర్తి చేయాలి” అని స్థానికులు, రైతులు డిమాండ్ చేస్తున్నారు.ప్రజా రవాణాకు, రైతుల పంటల తరలింపునకు కీలకమైన ఈ రహదారికి ఇకనైనా మోక్షం కల్పిస్తారా? అని స్థానికులు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు.

# సమాచార, పౌర సంబంధాల శాఖ అదనపు సంచాలకుడిగా డి. ఎస్. జగన్ పదోన్నతి



**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 1 , నేటి శుభోదయ :**
సమాచార, పౌర సంబంధాల శాఖలో డి. ఎస్. జగన్ అదనపు సంచాలకుడిగా పదోన్నతి పొందారు. పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన అనంతరం ఆయన బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం డి. ఎస్. జగన్ డా. బి. ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి డి. ఎస్. జగన్ కు పదోన్నతి సందర్భంగా అభినందనలు తెలియజేశారు. సమాచార, పౌర సంబంధాల శాఖ ద్వారా ప్రభుత్వ కార్యక్రమాలు, అభివృద్ధి, సంక్షేమ పథకాల సమాచారాన్ని ప్రజలకు మరింత సమర్థవంతంగా చేరవేయడంతో పాటు ప్రభుత్వం, ప్రజలు, మీడియా మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కృషి చేయాలని మంత్రి ఆకాంక్షించారు. అనంతరం డి. ఎస్. జగన్ సమాచార, పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ డా. జి. ముకుంద రెడ్డిని కూడా మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రత్యేక కమిషనర్ ఆయనకు పదోన్నతి సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. అదనపు సంచాలకుడిగా బాధ్యతలు స్వీకరించిన డి. ఎస్. జగన్ మాట్లాడుతూ, తనపై ప్రభుత్వం ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా విధులను సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలిపారు. ప్రభుత్వ విధానాలు, అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల సమాచారాన్ని ప్రజలకు విస్తృతంగా చేరవేయడంలో శాఖ అధికారులతో సమన్వయంతో పనిచేస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సమాచార, పౌర సంబంధాల శాఖ అధికారులు, సిబ్బంది డి. ఎస్. జగన్ కు శుభాకాంక్షలు తెలిపారు.

# పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాల్సిందే : టిజిఈజేఏసి డిమాండ్

- ఐడీఓసీలో పెన్షన్ విద్రోహ దినం నిర్వహించిన ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు










**ఖమ్మం, సెప్టెంబర్ 1, నేటి శుభోదయ :**
ఉద్యోగుల భవిష్యత్ భద్రతకు భరోసానిచ్చే పాత పెన్షన్ విధానాన్ని (ఓపిఎస్) పున రుద్ధ రించాల ని డిమాండ్ చేస్తూ, టిజిఈజేఏసి ఖమ్మం జిల్లా ఆధ్వర్యంలో మంగళవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఖమ్మం ఐడీఓసీ కార్యాలయ ప్రాంగణంలో “పెన్షన్ విద్రోహ దినం” కార్యక్రమాన్ని నిర్వహించారు. టిజిఈ జేఏ సి ఖమ్మం జిల్లా చైర్మన్ గుంటుపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, టిజిఈ జేఏ సి భాగ స్వామ్య స ంఘాల నాయ కులు, ఉద్యోగులు పెద్ద స ంఖ్యలో పాల్గొన్నారు. ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి తమ నిరసనను వ్యక్తం చేశారు. పాత పెన్షన్ విధానాన్ని పునరు ద రించాల ని, ఉద్యోగుల పెన్షన్ హక్కును పరిరక్షించాలని నినాదాలు చేశారు.

**- ఉద్యోగుల భవిష్యత్ భద్రతకు ఓపిఎస్ ఎంతో కీలకం : గుంటుపల్లి శ్రీనివాసరావు**

టిజిఈజేఏసి ఖమ్మం జిల్లా చైర్మన్ గుంటుపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ అనంతరం ఆర్థిక భద్రత కల్పించే పెన్షన్ విధానం వారి భవిష్యత్ జీవితానికి అత్యంత కీలకమైన అంశమన్నారు. ఎన్నో సంవత్సరాలు ప్రభుత్వ సేవలో పనిచేసిన ఉద్యోగులకు పదవీ విరమణ అనంతరం గౌరవప్రదమైన, భద్రమైన జీవితం అందించేందుకు పాత పెన్షన్ విధానం అవసరమని పేర్కొన్నారు.ఉద్యోగుల పెన్షన్ హక్కును ప్రభావితం చేసే విధానాలను ప్రభుత్వం పునఃపరిశీలించి, ఉద్యోగుల ఆకాంక్షలకు అనుగుణంగా పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి టిజిఈజేఏసి నిరంతరం కృషి చేస్తోందని, అవసరమైతే భవిష్యత్‌లో ఉద్యమాన్ని మరింత విస్తృతం చేస్తామని స్పష్టం చేశారు.అలాగే ఈ నెల 10వ తేదీన హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో నిర్వహించే ఉద్యోగుల సభకు ఖమ్మం జిల్లా నుంచి అత్యధిక సంఖ్యలో ఉద్యోగులు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

**- పెన్షన్ ఉద్యోగుల హక్కు : కొంగర వెంకటేశ్వరరావు**

టిజిఈజేఏసి ఖమ్మం జిల్లా కన్వీనర్ కొంగర వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పెన్షన్ అనేది కేవలం పదవీ విరమణ అనంతరం లభించే ఆర్థిక ప్రయోజనం మాత్రమే కాదని, ఉద్యోగులు, వారి కుటుంబాల భవిష్యత్ భద్రతతో ముడిపడిన హక్కు అని అన్నారు.ప్రభుత్వ సేవలో సుదీర్ఘకాలం పనిచేసిన ఉద్యోగులకు పదవీ విరమణ అనంతరం ఆర్థిక భద్రత, గౌరవప్రదమైన జీవితం కల్పించేందుకు పాత పెన్షన్ విధానం అవసరమన్నారు. ఓపిఎస్ పునరుద్ధరణ కోసం ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్‌ను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవాలని కోరారు.

**- పెన్షన్ హక్కు కోసం సంఘటితంగా పోరాడుతాం : భాగస్వామ్య పక్షాల నాయకులు**

టిజిఈజేఏసి భాగస్వామ్య పక్షాల నాయకులు మాట్లాడుతూ ఉద్యోగుల పెన్షన్ హక్కు కోసం సంఘటితంగా పోరాడతామని, పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ జరిగే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. పెన్షన్ ఉద్యోగుల భవిష్యత్ భద్రతకు సంబంధించిన హక్కు అని, దానిని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. “ఉద్యోగుల కోసం – మా స్వరం వినిపిద్దాం, పాత పెన్షన్ సాధించుకుందాం” అనే నినాదంతో ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమానికి బిఆర్ఎస్ యువజన నాయకులు రాకేష్ రెడ్డి సంఘీభావం తెలిపారు.కార్యక్రమంలో టిఎన్జీఓస్, టిజీఓ జిల్లా కార్యదర్శు లు , కొణిదెన శ్రీనివాస్,మోదుగు వేలాద్రి, టిఎస్ యుటిఎఫ్ బాధ్యులు పారుపల్లి నాగేశ్వరరావు, ఎస్.కె. రంజాన్, టిపిటిఎఫ్ నుండి విజయ్, నాగి రెడ్డి, పెంక్షనర్ సంఘ బాధ్యులు ఎం.సుబ్బయ్య, రవి కుమార్, రవి,రమణ యాదవ్,క్లాస్ ఫోర్త్ నుండి బిక్కు, వెంకటరమణ, పంచాయతీ రాజ్ నుండి రాజేష్, టిఎన్జీఓస్ నుండి వల్లపు వెంకన్న, కొమరగిరి దుర్గాప్రసాద్, ఎర్ర రమేష్, శ్రీధర్ సింగ్,అస్లాం,తాళ్లూరి శ్రీకాంత్, హరికృష్ణ కోణార్, కోటపాటి రుక్మారావు, అస్లాం, విజయ, కోమలి నాగిరెడ్డి, పరిష పుల్లయ్య, పాల్గొన్నారు.

Printed Published and Owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao, RNI Title Code :- RNI TELTEL/2024/89620